JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి I శుక్రవారం 10-07-2026

Medchal - Malkajgiri I Friday 10-07-2026

Follow: jayabherinews

సంపుటి : 03 I సంచిక : 39

పేజీలు : 8 I వెల : 5

Vol. 03 I Issue 39 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me

jayabheripaper@gmail.com





# తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలన్నది మా సంకల్పం

- సీతారాంపూర్‌లో నెలకొల్పిన 5.6 గిగావాట్ల సామర్థ్యం కలిసిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్
- ఆ నగరాల అనుభవాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి
- మూసీ నది కాలుష్యంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు

**జయభేరి, హైదరాబాద్ :**

ప్రిమియర్ ఎనర్జీ రూపొందించిన మొట్టమొదటి సోలార్ ఆక్సీ ట్రీ - సోలార్ పవర్డ్ స్ట్రీట్ లైట్, ఎయిర్ క్లీనింగ్ సిస్టమ్ 'ఆక్సీట్రీ'ని, యూనిట్‌లో సోలార్ మాడ్యూల్స్‌కు సంబంధించి వివిధ ఉత్పత్తులను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ యూనిట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు చెన్నై లాంటి మెట్రోపాలిటన్ నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోని కారణంగానే చాలా కష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. "ఆ నగరాల అనుభవాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలోని జీడిమెట్ల, బాలానగర్ లాంటి ఇండస్ట్రియల్ పార్కులున్న ప్రాంతాల్లో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం, దానికితోడు మూసీ నది కాలుష్యంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఈ కోర్ అర్బన్ రీజియన్ లో పూర్తిగా

...మిగతాది 2 లో

*హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు అంతర్భాగం మొత్తంగా కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ ఏరియాలో 1 కోటి 35 లక్షల జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సోలార్ మాడ్యూల్స్ తయారీ రంగంలో ప్రసిద్ధ ప్రిమియర్ ఎనర్జీస్ సంస్థ రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో నెలకొల్పిన 5.6 గిగావాట్ల సామర్థ్యం కలిసిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు.*

# త్వరలో 6జీ సేవలు తీసుకురాబోతున్నాం

## 3వ ఆర్థిక వ్యవస్థకు అడుగు దూరంలో ఉన్నాం: ప్రధాని మోదీ

*ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని ఆంథోని అల్బనీస్‌తో కలిసి 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేస్తూ భారత్-ఆస్ట్రేలియా సంబంధాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.*



**జయభేరి, న్యూఢిల్లీ:**

మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన భారతీయ ప్రవాసుల కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఆ దేశ ప్రధాని ఆంథోని అల్బనీస్‌తో కలిసి మెల్ బోర్న్ మీట్స్ మోదీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ, భారత్‌ఆస్ట్రేలియా సంబంధాలు గత కొన్నేళ్లలో ఎంతగా బలోపేతమయ్యాయో వివరించారు. తాను 2014లో తొలిసారి ఆస్ట్రేలియా పర్యటించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అది 28 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాని చేసిన తొలి ఆస్ట్రేలియా పర్యటన అని పేర్కొన్నారు. ఇప్పటివరకు తాను మూడుసార్లు ఆస్ట్రేలియాను సందర్శించానని, ఇది తనకు ఒక "హ్యాట్రిక్" లాంటిదని మోదీ అన్నారు. ఈ మూడు పర్యటనలు భారత్‌ఆస్ట్రేలియా మధ్య మరింత బలపడుతున్న ద్వైపాక్షిక భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. గత 12 ఏళ్లలో దేశ మెట్రో నెట్‌వర్క్ రెండు డజన్లకు పైగా నగరాలకు విస్తరించిందని, దీనితో ఇది ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశ మౌలిక సదుపాయాల వృద్ధిని ప్రదర్శించారు. మెల్బోర్న్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ, భారతదేశంలో ప్రతిరోజూ 12.5 మిలియన్లకు పైగా ప్రజలు మెట్రోలో ప్రయాణిస్తారని అన్నారు. నమో భారత్ రాపిడ్ రైల్, వందే భారత్ రైళ్ల వంటి ప్రాజెక్టుల ద్వారా భారతదేశం తన సెమీహైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను కూడా వేగంగా విస్తరిస్తోందని, ఇది ఆధునిక రవాణా మౌలిక సదుపాయాల కోసం దేశం చేస్తున్న కృషిని ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. అతి త్వరలో భారత్ 3వ ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని,

...మిగతాది 2 లో

# కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లో చేరేది లేదు

- బీఆర్ఎస్ ఖాతాలోని రూ. 1400 కోట్లు అమర వీరుల కుటుంబాలకు పంచాలి
- కొత్తగూడెం పర్యటనలో కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు

**జయభేరి, కొత్తగూడెం :**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను బీఆర్ఎస్‌లోకి వెళ్తానని ప్రచారం చేస్తున్నారని.. అయితే తన కంఠంలో ప్రాణం ఉండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లేదే లేదని, ఆ పార్టీతో జత కట్టేదే లేదని ఆమె స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తాను ఎన్నో అవమానాలకు గురయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి బాయి బాటలో భాగంగా కొత్తగూడెం పర్యటనకు వెళ్లిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ. 1400 కోట్లు అవి క్విడ్ ప్రో క్రో కింద ఆంధ్రా కాంట్రాక్టర్లు ఇచ్చిన సొమ్ములు కాదా అని ప్రశ్నించిన కవిత.. ఆ సొమ్మును అమర వీరుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పంచాలని ఆమె డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నుంచి కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు వివిధ సంస్థలకు అప్పగించిన భూముల వివరాలను రివ్యూ చేస్తామని కవిత తెలిపారు. తాను ప్రజల్లో ఉండే పోరాడతానన్న కవిత.. తల్లి, చెల్లి అనే ఇంగితం మర్చిపోయి సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారన్న

...మిగతాది 2 లో



# యూట్యూబర్ రావణ్‌కు గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం




- సంఘ విద్రోహ శక్తులను ప్రోత్సహిస్తే ఊరుకోం
- బనగానపల్లెలో సీఎం చంద్రబాబు వార్నింగ్

**జయభేరి, విజయవాడ, జూలై 9 :**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు హిందూ దేవుళ్లను కించపరుస్తూ, నిషేధిత తీవ్రవాద సంస్థలకు మద్దతుగా వీడియోలు పోస్ట్ చేసిన కేసులో అరెస్టయిన యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ వ్యవహారం ఇప్పుడు ఏపీలో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా స్పందించారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో పర్యటించిన ముఖ్యమంత్రి.. అక్కడ రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మత విద్వేషాలు రేకెత్తించే రావణ్ లాంటి అసాంఘిక శక్తుల వెనుక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉందని అన్నారు. రావణ్‌కు గొడ్డలి పార్టీనే భారీగా ఆర్థిక సాయం అందిస్తోందని ఆరోపణలు చేశారు. 'సంఘ విద్రోహ శక్తులను ఎవరూ ప్రోత్సహించవద్దు. కుల, మతాలను విభజించడానికి వీల్లేదు. రావణ్ అనే వ్యక్తి.. పురాణాలను దూషించాడు. రాముడు, సీతపై నీచంగా మాట్లాడాడు. తీవ్రవాదాన్ని, పాకిస్థాన్‌ను సమర్థించాడు. అలాంటి వాళ్లకు గొడ్డలిపార్టీ ఆర్థికసాయం చేసింది. ఇది ఎంత బరితెగింపు. ఇది న్యాయమా..? ప్రజలకు ఈ విషయాలు తెలియాలి. నంద్యాల పక్కనే పులివెందుల. 2019 అందరూ గుర్తు పెట్టుకోవాలి. అప్పుడు నేనే ముఖ్యమంత్రిని. నేను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బాబాయ్‌ను గొడ్డలితో లేపేసి.. గుండెపోటుగా చిత్రీకరించి.. రెండో రోజున కత్తి నా చేతులో పెట్టి రాజకీయ డ్రామా ఆడారు.' అని చంద్రబాబు ఫైరయ్యారు. రాష్ట్రంలో వింత ప్రవర్తన కలిగిన కొందరు వ్యక్తులు తిరుగుతున్నారని.. కేవలం ఆస్తి కోసం కన్న తల్లిని హింసిస్తున్నారని ఫైరయ్యారు. ఓట్ల కోసం చనిపోయిన తండ్రి ఫోటోలకు పూజలు చేస్తారని.. కన్నతల్లిని గౌరవించలేని వ్యక్తి సమాజానికి ఏం అవసరమని ప్రశ్నించారు.




# లక్ష్యానికి దూరంగా వరి నాట్లు

- తెలంగాణలోని 16 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లు సర్కారు నివేదిక
- జూలై నెలలో సాధారణం కంటే 16 శాతం తక్కువగా నమోదైన వర్షాలు

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బిగ్ రిలీఫ్

- బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- 45 రోజులకు పైగా రిమాండ్‌లో ఉన్న భగీరథ్



▶▶ మొదటిపేజీ తరువాయి

## మా సంకల్పం

కాలుష్యరహిత ప్రాంతంగా మార్చాలని సంకల్పించాం. పరిశ్రమలను ఓఆర్‌ఆర్ బయటకు తరలించడానికి చట్టం చేశాం. ఓఆర్‌ఆర్ బయట పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతంలో మాన్యుఫాక్చరింగ్ జోన్ గా గుర్తించాం. ఇక్కడి నుంచి తరలించిన పరిశ్రమలకు అవసరమైన స్థలాలను మాన్యుఫాక్చరింగ్ జోన్ లో కేటాయిస్తాం.." అని ముఖ్యమంత్రి వివరించారు. "మాన్యూఫాక్చరింగ్ జోన్‌లో మొట్టమొదటగా ప్రారంభమైన సంస్థ ప్రీమియర్ ఎనర్జీ కావడం ప్రశంసనీయం. కేవలం 12 నెలల కాలంలో యూనిట్‌ను నెలకొల్పింది" అని ముఖ్యమంత్రి సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. "తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రాంతీయ మండళ్లుగా విభజించి సమగ్రమైన ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం. 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలన్నది మా సంకల్పం. వైట్ కాలర్ ఉద్యోగాలు కష్టమైన పరిస్థితులను అర్థం చేసుకుని యువత బ్లూకాలర్ జాబ్స్ అందిపుచ్చుకునే దిశగా నైపుణ్యతను పెంచడానికి ఎక్కువ దృష్టిసారించాం. ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి మొత్తంగా వ్యవస్థలను ఆ దిశగా సిద్ధం చేస్తున్నాం" అని చెప్పారు. "హైదరాబాద్ ప్రపంచంతో పోటీ పడాలంటే ఇప్పుడున్న పెట్టుబడులు, పరిశ్రమలు సరిపోవు. మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు రావాలి. 2047 నాటికి వంద సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకోబోతున్న తరుణంలో వెనక్కి తిరిగి చూస్తే ఎక్కడ మొదలయ్యాం. ఎక్కడికి చేరుకోవాలనుకున్నామో ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలి. పెరిగిన కాలుష్యాన్ని నియంత్రించడానికి సోలార్ ఎనర్జీతో ఆక్సిజన్ పంపింగ్ చేసే యంత్రాలను ప్రీమియర్ ఎనర్జీ రూపొందించడం అభినందనీయం. అలాంటి పరిస్థితులు తలెత్తడంపై అందరూ ఆలోచన చేయాలి. ప్రకృతిని విధ్వంసం చేయడం వల్ల ఇలాంటి తీవ్రమైన పరిణామాలకు దారితీస్తోంది. నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అంతకన్నా ఎక్కువ ప్రజల నుంచి సంపూర్ణ సహకారం ఉండాలి" అని ముఖ్యమంత్రి గారు కోరారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రీమియర్ ఎనర్జీ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్ సలూజా, మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సింగ్ సలూజా, డైరెక్టర్ సుధీర్ మూల, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవతి రోహిణి, ప్రభుత్వ అధికారులు, సంస్థ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## త్వరలో 6జీ సేవలు..

అలాగే దేశంలో 6జీ సేవలు కూడా తీసుకురాబోతున్నట్లు ప్రకటించాడు. 12 ఏళ్లలో 'మేక్ ఇన్ ఇండియా' ఒక గ్లోబల్ బ్రాండ్‌గా రూపుదిద్దుకుంది. మన మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మార్కెట్లకు చేరుకున్నాయి. మన ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా తమ ఉనికిని విస్తరించుకున్నాయి" అని అన్నారు. భారత తయారీ రంగానికి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ, ఆవిష్కరణలు, ఉత్పత్తి మరియు ఎగుమతులకు దేశం ఒక విశ్వసనీయ కేంద్రంగా ఆవిర్భవించడాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. భారతదేశంలో పెరుగుతున్న రక్షణ సామర్థ్యాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా వేదికగా ప్రశంసించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో దేశ సైనిక బలం ప్రదర్శించబడిందని, దాని ప్రభావం లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాద శిబిరాలకు మించి విస్తరించిందని ఆయన అన్నారు. ఆస్ట్రేలియా ప్రపంచ క్రీడా శక్తి అని, అదే సమయంలో భారతదేశం కూడా క్రీడా మౌలిక సదుపాయాలు, ప్రతిభ అభివృద్ధిలో ఒక పెద్ద మార్పు వస్తుందని అన్నారు.
మెల్‌బోర్న్‌లో భారతీయ సమాజం ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికింది. భారీ సంఖ్యలో హాజరైన ప్రవాస భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన మోదీ, ఈ కార్యక్రమాన్ని "హౌస్‌ఫుల్", "బ్లాక్‌బస్టర్"గా అభివర్ణించారు. తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ, ఆ ప్రాంతపు సాంప్రదాయ యజమానులను గుర్తు చేసుకుని, వారి పెద్దలకు గౌరవం తెలిపారు. గత పర్యటనల్లో సిడ్నీలో ప్రవాస భారతీయులతో సమావేశమైన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, మెల్‌బోర్న్‌లోని భారతీయులను కూడా కలవాలని చాలా రోజులుగా ఎదురుచూస్తున్నానని చెప్పారు .ఈ కార్యక్రమం హౌస్‌ఫుల్‌గా ఉంది. ఇది ఒక బ్లాక్‌బస్టర్. ఇంతకుముందు నేను సిడ్నీలో మీ అందరినీ రెండుసార్లు కలిశాను. మెల్‌బోర్న్ ప్రజలను కూడా కలవాలని ఎంతోకాలంగా అనుకుంటున్నాను. అందుకే ఈసారి మెల్‌బోర్న్ ప్రజలతో కలిసి ఒక 'ఫ్లాట్ వైట్ కాఫీ' తాగాలని నిర్ణయించుకున్నాను" అని ప్రధాని మోదీ చెప్పగా, సభలో ఉన్నవారు ఘనంగా చప్పట్లతో స్వాగతించారు.

## రావణ్‌కు గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం

తల్లుల విలువ తెలిసిన ప్రభుత్వం కాబట్టే తాము తల్లికి వందనం పథకం తెచ్చామన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఒకప్పుడు ఉన్న ఫ్యాక్షనిజం, ముఠా కక్షలను అణచివేసి శాంతిభద్రతలను నెలకొల్పింది తెలుగుదేశం ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విసుగు, విరామం లేకుండా కేవలం ప్రాంతాల వారీగా ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు చూస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు కూటమి ప్రభుత్వం పూర్తి రక్షణగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఆడబిడ్డల జోలికి వస్తే ఎంతటి వారికైనా సరే.. అదే చివరి రోజు అవుతుందని సీఎం చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు.

## బీఆర్‌ఎస్‌లో చేరేది లేదు

ఆమె.. మర్యాద పాటించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆమె బీఆర్‌ఎస్ సోషల్ మీడియాకు హెచ్చరికలు జారీ చేశారు. తమ పార్టీలోని యువత వ్యక్తిగత కామెంట్ల జోలికి పోరన్న కవిత.. లైన్ దాట్లొద్దని బీఆర్‌ఎస్ శ్రేణులను హెచ్చరించారు. తమ పార్టీతో భయం లేదంటూనే ఎన్నికల సంఘానికి వెయ్యికిపైగా ఫిర్యాదులు ఇచ్చారన్న కవిత.. టీఆర్‌ఎస్ అనే పేరు తనకు రాకుండా ఉండటం కోసం కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. హరీశ్ రావును కాళేశ్వరం అనకొండ అంటూ సంచలన ఆరోపణలు చేసిన కవిత.. ఆయన్ను బీఆర్‌ఎస్ ఇంకా ముందు పెడుతోందన్నారు. కేటీఆర్ తన మిత్రుడు ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రో కో ద్వారా అక్రమ పర్మిషన్లు ఇచ్చారని కవిత ఆరోపించారు. ఫినిక్స్ సంస్థకు 80 వేల కోట్ల విలువైన భూములు కట్టబెట్టారని ఆరోపించిన కవిత.. ఆ సంస్థ 33 లక్షల టన్నుల కలప కొట్టేస్తోందన్నారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పెట్టిన కేసులను కూడా పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన భూమికి ఇంకా అదనంగా ఈ ప్రభుత్వం కూడా భూమి ఇస్తోందన్న కవిత.. అవినీతి విషయంలో బీఆర్‌ఎస్ కిటికీలు తెరిస్తే కాంగ్రెస్ తలుపులు తెరిచిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పగించిన భూములు అన్నింటిపైనా రివ్యూ చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో చిన్న కాంట్రాక్టర్లు, స్కూల్ యాజమాన్యాలు ఎంత ఖర్చు చేశాయన్న కవిత.. తెలంగాణ సాధించిన తర్వాత వారికి న్యాయం జరగాలని తాను బీఆర్‌ఎస్‌లో ఉండి కొట్లాడానన్నారు. అప్పుడు కూడా తాను ఉద్యమకారులు, కార్మికుల కోసం ఫైట్ చేశానని చెప్పారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న సమయంలోనూ తాను ఉద్యమకారుల పక్షాన నిలబడ్డానని కవిత తెలిపారు కానీ ఉద్యమకారులకు అన్యాయం జరిగిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కానీ వారికి అన్యాయం జరిగింది. అందుకే చాలా ఆవేదనతో చెబుతున్నా. బీఆర్‌ఎస్ పార్టీ అకౌంట్ లో ఉన్న డబ్బును అమరవీరుల కుటుంబాలకు పంచాలి. రైతులకు చేస్తున్న మోసాన్ని డైవర్ట్ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం అంశాన్ని తెర మీదకు తెచ్చిందన్న కవిత.. సీఎం రేవంత్ రెడ్డికి సాగునీటి అంశాల పట్ల కనీస అవగాహన లేదన్నారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా అర కిలోమీటర్ రాళ్ల గోడ కట్టి కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసుకోవచ్చని కవిత చెప్పారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని రిజర్వాయర్లకు నీళ్లు ఎత్తి పోసుకోవచ్చన్నారు. కానీ గత ప్రభుత్వంపై కక్షతో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. సింగరేణిలో ఓపెన్ కాస్ట్, అండర్ గ్రౌండ్ మైన్ అనే హెల్త్ మిక్స్ ఉండాలని.. అప్పుడే సంస్థ బాగుంటుందని కవిత అభిప్రాయపడ్డారు. సింగరేణి ఇబ్బందుల్లో ఉండటానికి ఈ ప్రభుత్వమే కారణమని, సంస్థకు ఇవ్వాల్సిన రూ. 54 వేల కోట్లు ఇవ్వకపోవటంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆమె ఆరోపించారు. సింగరేణిలో వన్ విజన్, వన్ ఫ్యామిలీ అంటారు. కానీ ఆఫీసర్లకు ఒక రూల్, కార్మికులకు ఒక రూల్ నడుస్తోందన్నారు. సింగరేణికి నిజాం 17 గనులను రాసిచ్చారన్న కవిత.. యూపీఏ హయాంలో జరిగిన భూ కుంభకోణం కారణంగా బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను జాతీయం చేసిందని.. తద్వారా 17 బొగ్గు గనులను కేంద్రం లాక్కుందన్నారు. సింగరేణికి తాడిచర్ల గనిని ఇచ్చిన కేంద్రం మిగతా 16 గనులను కూడా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

# వయనాడ్‌కు ఈ పరిస్థితి ఎందుకు..?



కేరళలో ప్రకృతి ప్రకోపానికి శవాల దిబ్బగా మారిన ప్రాంతాల్లో.. అన్వేషణ, సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన కొనసాగు తున్నాయి. బురద, శిథిలాల నుంచి భారీగా మృతదేహాలు బయటపడుతున్నాయి.: వయనాడ్ పశ్చిమ కనుమల అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థలో ఉంది. ఇక్కడి శిలలు ప్రీకాంబ్రియన్ యుగం నాటి గ్నైస్, స్కిస్ట్ రకానికి చెందినవి, ఇవి చాలా పెళుసుగా ఉంటాయి. ఈ శిలలలో సహజ పగుళ్లు ఉంటాయి, ఇవి వర్షపు నీరు పడ్డ తర్వాత బలహీనమవుతాయి. 2024కొండచరియ విపత్తుకు ముందు 48 గంటల్లో, 572.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది, ఇది ఐఎండి అంచనా కంటే 200 శాతం ఎక్కువ. వయనాడ్‌లోని వైతిరి తాలూకాను పశ్చిమ కనుమల పర్యావరణవేత్తల ప్యానెల్ పర్యావరణ సున్నిత జోన్1గా ప్రకటించినప్పటికీ, అభివృద్ధి పనులు ఆగకుండా కొనసాగాయి.హెచ్చరికలను పట్టించుకోలేదు: 2011లో, మాధవ్ గాడ్గిల్ కమిటీ పశ్చిమ కనుమలలోని సున్నితమైన ప్రాంతాల్లో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మైనింగ్‌పై తాత్కాలిక నిషేధాన్ని సిఫార్సు చేసింది. కేరళ ప్రభుత్వం ఆ నివేదికను పక్కన పెట్టింది. 2024 కొండచరియ విపత్తుకు 16 గంటల ముందు హ్యూమ్ సెంటర్ ఫర్ ఎకాలజీ ఒక హెచ్చరిక జారీ చేసింది, కానీ అది అధికారిక వ్యవస్థలో భాగం కానందున జిల్లా యంత్రాంగం దానిని విస్మరించింది. కేంద్ర ప్రభుత్వం కూడా జూలై 23, 24, 25, 26 తేదీలలో భారీ వర్షాలు, కొండచరియ విపత్తుల గురించి హెచ్చరికలు జారీ చేసింది, కానీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. అభివృద్ధి పరుగులో పర్యావరణ నిర్లక్ష్యం: గత కొన్నేళ్లుగా వయనాడ్‌లో రిసార్ట్‌లు, రోడ్లు, పర్యాటక సౌకర్యాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. చెట్ల స్థానంలో కాంక్రీట్ కట్టడాలు వచ్చాయి. వర్షపు నీటి తీసుకునే భూమి తగ్గిపోయింది, అస్థిరమైన వాలులపై ఒత్తిడి పెరిగింది. సెప్టెంబర్ 2025 నాటి నివేదిక ప్రకారం, "వయనాడ్ కొండచరియ విపత్తు ప్రకృతి చర్య కాదు, అది మానవుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యం ప్రత్యక్ష ఫలితం." అని తేలింది. శిథిలాల కింద ప్రాణాలతో ఉన్నవారికోసం..రెస్క్యూ బృందాలు గాలిస్తున్నాయి. మరోవైపు ఈ జల ప్రళయానికి.. మానవుడి అత్యాశ, ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమంటున్నారు..పర్యావరణ వేత్తలు. కేరళలో విరిగిపడుతున్న కొండచరియలు.. ఊళ్లకు ఊళ్లనే నాశనం చేశాయి. వాయనాడ్‌లో ఇటీవల సంభవించిన ఘటనలో 295 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా..అనేక మంది ఆ శిథిలాల కిందే చిక్కుకుపోయారు. కనీవినీ ఎరుగని ఈ విపత్తుకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ విడుదల చేసింది. అక్కడ సంభవించిన విలయాన్ని 3డీ రూపంలో చూపించింది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 86వేల చదరపు మీటర్ల భూభాగం జారిపడిపోయినట్లు ఇస్రో అంచనా వేసింది. సముద్రమట్టానికి 1,550 మీటర్ల ఎత్తులో ఈ కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని గుర్తించింది. వాయనాడ్‌లో చోటుచేసుకున్న భారీ వినాశనాన్ని అంచనా వేసేందుకు..కార్టోశాట్ 3 శాటిలైట్‌తో పాటు ఆ ప్రాంతంలో అంతరిక్షం నుంచి తీసిన 3డీ చిత్రాలను ఇస్రో విశ్లేషించింది. గతంలోనూ అదే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన విషయాన్ని ఈ చిత్రాల్లో వివరించింది. కేరళలో గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు వాయనాడ్ ప్రాంతం మొత్తం తడిగా మారిపోయిందని నిపుణులు చెబుతున్నారు.వాయనాడ్ జిల్లాలో ప్రకృతి సృష్టించిన విపత్తు ఎన్నో కుటుంబాలను చిదిమేసింది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి గ్రామాలను నేలమట్టం చేసిన ఘటనలో..మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడటంతో మండక్కై, చూరాల్‌మల ప్రాంతాలు నామరూపాల్లేకుండా ధ్వంసమైపోయాయి. ముండక్కైలో 150 వరకు ఇళ్లు ఉండగా.. వాటిల్లో 65 పూర్తిస్థాయిలో నేలమట్టమయ్యాయి. శిథిలాలను తొలగిస్తే గానీ లోపల ఎంత మంది ఉన్నారనేది తెలియదని సహాయక బృందాలు చెబుతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. యుద్ధప్రాతిపదికన రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన భారత సైన్యం దాదాపు వెయ్యిమందికిపైగా స్థానికులను సురక్షితంగా కాపాడింది. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల నుంచి ప్రజలను రక్షించేందుకు సహాయక బృందాలు తాత్కాలిక వంతెనలను నిర్మించారు. రోడ్డు మార్గాలు ధ్వంసమై రాకపోకలకు వీలులేని ప్రాంతాల నుంచి వీటి ద్వారా ప్రజలను తరలిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఉపయోగించిన వీటిని.. బెయిలీ వంతెనలంటారు. వాయనాడ్‌లోని బాధిత ప్రాంతాల్లో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పర్యటించారు. కొండచరియలు విరిగిపడ్డ చురాల్‌మాల ప్రాంతాన్ని పరిశీలించారు. సహాయక చర్యలపై ఆరాతీశారు. రాహుల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీ , నేతలు కూడా కొండచరియలు విరిగిపడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. బాధితులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా కేరళ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు రాహుల్‌గాంధీ. కేంద్రం కూడా కేరళకు అండగా ఉండాలన్నారు. సహాయక శిబిరాల్లో ఉన్న వరదబాధితులను కూడా కలిశారు.. రాహుల్ , ప్రియాంక. అటు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా వయనాడ్ వెళ్లి విపత్తు పరిస్థితిపై సమీక్షించారు.మరోవైపు మానవ చర్యల వల్లే కేరళలో తరచూ ఇలాంటి ప్రకృతి విపత్తులు జరుగుతున్నాయంటున్నారు..పర్యావరణ వేత్తలు. కేరళకు పశ్చిమాన అరేబియా సముద్రంతో పాటు తూర్పున విస్తారమైన పశ్చిమ కనుమలు.. విస్తరించి ఉన్నాయి. వీటిని ఆస్వాదించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. దాంతో ఎకో టూరిజం పేరుతో హోటళ్లు, రిసార్టుల నిర్మాణం భారీగా జరుగుతోంది. ఇందుకోసం అడవులను కూడా విచ్చలవిడిగా నరికేస్తున్నారు. పర్యావరణపరంగా అత్యంత సున్నిత ప్రాంతమైన పశ్చిమ కనుమలు ఈ పరిణామాలతో తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. 2017, 2018, 2019ల్లో వరుసగా తుఫాన్లు, వరదలు కేరళను ముంచెత్తాయి. ఇప్పుడు వాయనాడ్ విధ్వంసం..కోలుకోలేని దెబ్బతీసింది.కేరళలోని వాయనాడ్, ఇడుక్కి జిల్లాల్లో కొండ ప్రాంతాలపై ఇటీవల నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోవడమే పెను సమస్యగా పరిణమించింది. వేసవిలో తీవ్రమైన ఎండలు, వర్షాకాలంలో మితిమీరిన వానలు పరిపాటిగా మారాయి. దాంతో కొండచరియలు విరిగిపడే ముప్పు నానాటికీ పెరుగుతోంది. బాగా ఎండిన నేలల్లో వాననీరు తక్కువగా ఇంకుతుంది. కొండల పైభాగంలో రాతి శిఖరాలను ఆవరించి ఉండే మట్టి పొరలు వదులుగా ఉంటాయి. భారీ వర్షాలకు తడిసి, వరద ఉధృతికి కొట్టుకుపోతాయి. తాజా విలయమే ఇందుకు ఉదాహరణ. గత ఏడేళ్లలో దేశవ్యాప్తంగా అత్యంత ఎక్కువ సంఖ్యలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు నమోదైంది కేరళలోనే. దేశవ్యాప్తంగా 3 వేల 782 ఘటనలు జరిగితే..వాటిలో కేరళలోనే 2 వేల 239 ఘటనలు జరిగాయి. పర్యావరణ విధ్వంసంపై కేరళ ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే..వయనాడ్ ఘటనలు నిత్యకృత్యంగా మారుతాయని హెచ్చరిస్తున్నారు..పర్యావరణ వేత్తలు.

# లక్ష్యానికి దూరంగా వరి నాట్లు



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం సీజన్ ప్రారంభమై దాదాపు 38 రోజులు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా.. మిగిలిన 17 జిల్లాల్లో కేవలం సాధారణ వర్షపాతమే నమోదైనట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ వానాకాలం సీజన్ సాగు పరిస్థితులపై వ్యవసాయశాఖ బుధవారం ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరి సాగు తీవ్రంగా మందగించగా.. ఇతర పంటల సాగు కూడా లక్ష్యానికి చాలా వెనుకబడి ఉన్నట్లు తెలుస్తోంది.

**లక్ష్యానికి దూరంగా వరి నాట్లు..**

రాష్ట్రంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మొత్తం 65,95,645 ఎకరాల్లో వరి సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే వర్షాలు ముఖం చాటేయడంతో ఇప్పటి వరకు కేవలం 4,22,340 ఎకరాల్లో మాత్రమే (అంటే 6.40 శాతం) నాట్లు పడ్డాయి. నీటి వనరులు సరిగ్గా లేకపోవడం, సకాలంలో రుతుపవనాలు ఊపందుకోకపోవడంతో అన్నదాతలు వరి నాట్లు వేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. వరితో పాటు రాష్ట్రంలో అన్ని రకాల పంటల అంటే పత్తి, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు వంటి సాగును పరిశీలిస్తే.. మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలుగా అంచనా వేశారు. కానీ నివేదిక ప్రకారం ఇప్పటి వరకు కేవలం 55,31,812 ఎకరాల్లో (41.79 శాతం) మాత్రమే విత్తనాలు నాటడం లేదా పంటలు వేయడం పూర్తయింది. అంటే సగానికి పైగా సాగు భూములు ఇంకా బీడుగానే ఉన్నాయి.

**జూలైలో 16 శాతం.. సీజన్ మొత్తంలో 13 శాతం తక్కువ వర్షపాతం!**

వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం.. జూలై నెలలో సగటున 47.6 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా కేవలం 39.9 మి.మీ. మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 16 శాతం తక్కువ. అలాగే జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 177.9 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 154.9 మి.మీ. మాత్రమే కురిసింది. ఇది సీజన్ సగటు కంటే 13 శాతం లోటుగా రికార్డయింది.
లోటు వర్షాపాతం ఉన్న 16 జిల్లాల్లో.. ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, జనగామ, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ ఉన్నాయి. అయితే వర్షాల కొరత కారణంగా జిల్లాల వారీగా సాగు విస్తీర్ణంలో భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు, మేడ్చల్, వనపర్తి, సూర్యాపేట జిల్లాల్లో పంటల సాగు 25 శాతం కూడా దాటలేదు. ఇక నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట జిల్లాల్లో కొంతవరకు పరవాలేదనేలా 51 శాతం మేర సాగు పనులు జరిగాయి.
వర్షాలు కొంత అనుకూలించిన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో గరిష్ఠంగా 75 శాతం విస్తీర్ణంలో సాగు చేపట్టారు. రాబోయే రోజుల్లో అయినా భారీ వర్షాలు కురిస్తేనే వరి నాట్లు ఊపందుకునే అవకాశం ఉందని.. లేనిపక్షంలో సాగు విస్తీర్ణం మరింత తగ్గి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బిగ్ రిలీఫ్

- బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- 45 రోజులకు పైగా రిమాండ్‌లో ఉన్న భగీరథ్

జయభేరి, హైదరాబాద్ :

బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో బిగ్ రిలీఫ్ దక్కింది. హైదరాబాద్ పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో అతనికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని వారాలుగా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్‌కు న్యాయస్థానంలో ఊరట లభించింది. అయితే బెయిల్ మంజూరు చేసినప్పటికీ కేసు దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, కోర్టు విధించిన నిబంధనలను ఉల్లంఘించరాదని ఉన్నత న్యాయస్థానం భగీరథ్‌ను ఆదేశించింది. ఈ కేసు వివరాల్లోకి వెళితే.. మే 8న పేట్‌బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తనన బండి భగీరథ్ లైంగిక వేధింపులకు గురి చేశాడని ఓ మైనర్ అమ్మాయి ఫిర్యాదు చేయటంతో కేసు బుక్ అయింది. అనంతరం మే 16న అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి జైలులోనే ఉన్న భగీరథ్.. బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల హైకోర్టులో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. పిటిషనర్ తరఫున ప్రముఖ సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి హాజరై బలమైన వాదనలు వినిపించారు. భగీరథ్ ఒక విద్యార్థి అని ఇప్పటికే 45 రోజులకు పైగా జైలు శిక్ష అనుభవించడం వల్ల అతని విద్యా సంవత్సరం, భవిష్యత్తు, జీవితంలో ఎంతో విలువైన సమయాన్ని కోల్పోయాడని కోర్టుకు వివరించారు. పరస్పర అంగీకారంతో జరిగిన ఒక అంశంపై ఇలాంటి తీవ్రమైన కేసులు నమోదు చేయడం చట్టరీత్యా చెల్లదని నిరంజన్‌రెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గతంలో సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు ఇచ్చిన పలు కీలక తీర్పులను ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే న్యాయస్థానం విధించే ఎలాంటి కఠిన షరతులకైనా కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. మరోవైపు.. ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు ఈ బెయిల్ పిటిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. కేసు నమోదైన వెంటనే బాధితుల వాంగ్మూలాలను సేకరించామని, దర్యాప్తు తుది దశకు చేరినందున త్వరలోనే చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. ఈ కీలక దశలో నిందితుడికి బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందంటూ పీపీ వాదించారు. ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన తీర్పును వాయిదా వేయగా.. తాజాగా బెయిల్ ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తునకు ఆటంకం కలిగించకుండా, పోలీసుల విచారణకు ఎప్పుడు పిలిచినా హాజరుకావాలనే నిబంధనలతో న్యాయస్థానం ఈ బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రతి అందిన తర్వాత అవసరమైన షూరిటీలను సమర్పించి బండి భగీరథ్ జైలు నుంచి విడుదల కానున్నారు.

# నిరుపేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రభుత్వం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- బస్వాయపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో ఎమ్మెల్యే
- సిసి రోడ్డు పనులు ప్రారంభం

**జయభేరి, దేవరకద్ర :**

నిరుపేదల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాయ పల్లిలో గురువారం పలు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రామంలో సిసి రోడ్లను కూడా ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేసి చూపిస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడు తుందన్నారు. విద్యా, వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే కొత్త రూపురేఖలు వస్తున్నాయన్నారు. నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల సభ్యులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.








## ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు ప్రమాణస్వీకారం

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 09:**

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రం, స్వయం ప్రతిపత్తి పొందిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు కమిటీ ఈనెల 11న ప్రమాణస్వీకారం చేస్తున్నట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. పాలకమండలి ప్రమాణస్వీకారానికి సంబంధించిన ఏర్పాట్ల వివరాలను ఆలయ ఈవో భవానీ శంకర్ గురువారం విలేఖరుల సమావేశంలో వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్టీ నెంబర్ 392 (ఎండోమెంట్) ద్వారా రెండేళ్ల కాలపరిమితికి యాదగిరిగుట్టకు నూతన పాలకమండలిని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఈవో తెలిపారు. 11 మంది సభ్యులు, ఏడుగురు ఎక్స్అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 18 మంది ఈనెల 11న ఉదయం 11.37 గంటలకు కొండపైన ప్రధాన ఆలయం ముఖమండపం బంగారు వాకిలి ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో జరిగిన నూతన పాలకమండలి సభ్యుల సమావేశంలో టీటీడీ తరహాలో యాదాద్రి ఆలయాన్ని అభివృద్ధికి ధర్మకర్తల మండలి కృషి చేయాలని,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దర్శనాలు కల్పించాలని, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచనలిచ్చినట్లు ఈవో తెలిపారు. నూతన ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణస్వీకారం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో తొలి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఈవో తెలిపారు. ఈ సమావేశంలో యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై కీలక నిర్ణయాలు కూడా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాణస్వీకార మహోత్సవానికి పలువురు మంత్రులు,స్థానిక ఎమ్మెల్యేతో రాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని,ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## కౌకుంట్లలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మృతి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండలానికి చెందిన గుమ్మడాల రాఘవులు గౌడ్ గురువారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యానికి గురయ్యారు. దీంతో పరిస్థితి విష మించడంతో చికిత్స నిమిత్తం మహబూబ్ నగర్ కి తీసుకు వస్తుండగా మార్గమధ్యలోని దేవరకద్ర వద్ద ఆయన తుది శ్వాస విడిచారు. గుమ్మడాల రాఘవులు గౌడ్ అంటే గ్రామస్తులకు ఎనలేని అభిమానం. తన పదవీకాలంలో ఆయన ఎక్కడ ఉద్యోగం చేసిన అందరి మన్ననలు పొందారు. ఉద్యోగరీత్యా ఆయన మంచి పేరు ప్రతిష్టలు సంపాదించారు. అందరితో కలిసి మెలిసి ఉండే గుమ్మడాల రాఘవులు గౌడ్ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# దేశాన్ని శాసించే స్థాయికి జేపీఎన్ సిఈ కళాశాల విద్యార్థులు

- జేపీఎన్ సిఈ కళాశాల చైర్మన్ కె.ఎస్ రవికుమార్
- 30 వసంతాలు పూర్తి చేసుకున్న జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల




**జయభేరి, దేవరకద్ర :**

జేపీఎన్ సిఈ కళాశాల విద్యార్థులు నేడు దేశాన్ని శాసించే స్థాయికి ఎదుగుతుండడం అభినందనీయమని ఆ కళాశాల చైర్మన్ కె.ఎస్ రవికుమార్ అన్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థి యాదయ్య జెపిఎన్ సిఈ కళాశాల ఆణిముత్యమని ఆయన అభివర్ణించారు. మహబూబ్ నగర్ మండలంలోని ధర్మాపూర్ సమీపంలోనున్న జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాలలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెపిఎన్ సిఈ కళాశాల చైర్మన్ రవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారతదేశ అంతరిక్ష యాన వ్యోమగామి శిక్షణలో తెలంగాణ ముద్దుబిడ్డ, మహబూబ్ నగర్ జెపిఎన్ సిఈ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థి యాదయ్య ప్రతిభ కనబరచడం జరిగిందన్నారు. దీంతో జేపీఎన్ సిఈ చరిత్రలో నేడు గొప్ప సుదినం అని ఆయన అన్నారు.

అంతరిక్ష యానం వ్యోమగామి నడపడానికి యాదయ్య మానవ అంతరిక్ష యాన కార్యక్రమం కింద ప్రత్యేక శిక్షణ పొంది విజయం సాధించారన్నారు.రోదసి యాత్రలో కోసం ఆయన జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, ఇంజనీరింగ్ వంటి అంశాలలో కఠినమైన శిక్షణ పొందారని ఆయన అన్నారు. ఇది రెండు తెలుగు రాష్ట్రాల విజయమన్నారు. యాదయ్య ఎన్నో విజయాలను సాధించాలని రవికుమార్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తంకుమార్ రెడ్డి యాదయ్యకు ప్రశంసా పత్రాన్ని కూడా అందజేయడం జరిగిందన్నారు. జేపీఎన్ సిఈ కళాశాల విద్యార్థులు నేడు దేశాన్ని శాసించే స్థాయికి ఎదుగుతుండడం అభినందనీయమన్నారు. అమెరికాలో స్థిరపడిన 5గురు జేపీఎన్ సిఈ పూర్వ విద్యార్థులు ఇనిస్ట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ (ఐఏఎం)లో శిక్షణ పూర్తి చేసిన కే.యాదయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఎన్ సిసి ఏ ఎన్ ఓ గురు రాఘవేంద్ర రెడ్డి లతోపాటు కళాశాలలోని ఆయా విభాగాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే వ్యక్తికి రెండవ సారి ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్రనియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండల కేంద్రానికి చెందిన చింతకాయల వెంకటేష్ కుమారుడు శివ సాయి చికిత్స నిమిత్తం గురువారం రెండవసారి 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అందజేశారు. ఈ విధంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఎల్ఓసి అందజేయడం ఇది రెండవసారి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, దేవరకద్ర నియోజకవర్గం మాజీ యూత్ అధ్యక్షుడు వెంకటేష్, వార్డు సభ్యులు శేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పొర్ల వెంకటేష్, నాయకులు పిలోగు, జి.ప్రసాద్, ఎస్ ఆర్ శ్యాంసన్ లతోపాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్ఓసి లబ్ధిదారుని తల్లి మాట్లాడుతూ మా అబ్బాయి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో అడ్మిట్ కావడానికి డబ్బులు లేక చాలా ఇబ్బందులు పడ్డాం అన్నారు. స్థానిక నాయకులు ద్వారా ఎమ్మెల్యే మా అబ్బాయికి ప్రాణదాతగా నిలిచారన్నారు. ఈరోజు మా అబ్బాయి మరోసారి రెండోసారి ఎల్ ఓ సి ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. ఏమిచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ రుణం తీర్చలేమన్నారు. వారికి మా కుటుంబం పక్షాన వారికి లబ్ధిదారుని తల్లి ధన్యవాదాలు తెలిపారు.

## విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి: ఎస్ఎఫ్ఐ

**జయభేరి, మేడ్చల్ :**



విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జూలై 10న ఎస్ఎఫ్ఐతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యుడు వినయ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను విరమించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, కనీస మౌలిక వసతుల లేమి, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్రమ ఫీజు వసూళ్లను అరికట్టడంతో పాటు విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ, రవాణా పేర్లతో అదనపు వసూళ్లు చేయకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన, ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న జూలై 10 విద్యాసంస్థల బంద్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యుడు వినయ్ కోరారు.



## ప్రమాణస్వీకారానికి మంత్రికి.. ప్రభుత్వ విప్ కి ఆహ్వానం

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 09:**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ నూతన పాలకమండలి సభ్యులు ప్రమాణస్వీకారానికి తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని యాదగిరిగుట్ట ఆలయ డిప్యూటీ ఈవో దోర్బాల బాస్కర్ శర్మ,ఆలయ సూపరింటెండెంట్ రాజన్ బాబు తో పాటు ఆలయ అర్చకులు మంగళగిరి నర్సింహా మూర్తి,కిరణ్ చార్యులు ఆహ్వానించారు. గురువారం మంత్రి కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన యాదగిరిగుట్ట ఆలయ అధికారులు నూతన ట్రస్ట్ బోర్డు పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందజేసి, స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.



## తిలకం దిద్ది.. కరచాలనం చేసి ఎమ్మెల్యే జిఎంఆర్ కు స్వాగతం

- ఎమ్మెల్యే జిఎంఆర్ కు అభినందనల వెల్లువ



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కు గురువారం నియోజకవర్గం లోని ఆయా గ్రామాలలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. వివిధ కార్యక్రమాలలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకం దిద్ది స్వాగతం పలికారు. వృద్ధుల సైతం ఎమ్మెల్యే జిఎంఆర్ కు కరచాలనం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పిన సమస్యలను ఎమ్మెల్యే జిఎంఆర్ ఎంతో ఓపికతో విన్నారు. వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ కు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ప్రజలు ఘనంగా సన్మానించారు. చాలామందిని ఎమ్మెల్యే జిఎంఆర్ గ్రామాలలో ఆప్యాయతతో పలకరించారు. కుశల ప్రశ్నలు వేశారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాహ రిసెప్షన్ లో హైకోర్టు న్యాయవాది



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ లో గురువారం దామోదర్ తమ్ముడి వివాహ రిసెప్షన్ కి హైకోర్టు న్యాయవాది, దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన సరోజ్ రెడ్డిని ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.ఈ కార్యక్రమంలో సరోజ్ రెడ్డి యువసేన నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధి లోని పర్దిపూర్ లో నూతనంగా నిర్మించిన పోచమ్మ గుడిలో గురువారం జరిగిన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ పూజా కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ అమ్మవారిని దర్శించుకుని పలు పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ కు కార్యక్రమ నిర్వహకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఏబీవీపీ

- రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్
- జాతీయ విద్యార్థి దినోత్సవం - 78వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు దేవరకొండ లో ఘనంగా నిర్వహణ

**జయభేరి, దేవరకొండ :**




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం మరియు 78వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా దేవరకొండ గౌడ్ బాయ్స్ హై స్కూల్ నుంచి జడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ మైదానం వరకు విద్యార్థులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి,ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ర్యాలీలో దేశభక్తి నినాదాలు, విద్యార్థి చైతన్యాన్ని ప్రతిబింబించే నినాదాలతో దేవరకొండ పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ 1949 జూలై 9న ఆవిర్భవించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగి దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులను చైతన్యవంతం చేస్తోందన్నారు. గత 78 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య కోసం ఉద్యమాలు, జాతీయ పునర్నిర్మాణం, సామాజిక సేవ, నాయకత్వ వికాసం వంటి రంగాల్లో ఏబీవీపీ విశేష సేవలు అందిస్తోందని తెలిపారు.జ్ఞానం శీలం ఏకత అనే త్రిసూత్రం ఏబీవీపీకి మార్గదర్శకమని, జ్ఞానం వ్యక్తిత్వ వికాసానికి, శీలం సమాజ విశ్వాసానికి, ఏకత దేశ సమగ్రతకు ప్రతీకలని అన్నారు. విద్యార్థి కేవలం ఉద్యోగం కోసం చదివే వ్యక్తి కాకుండా, దేశ భవిష్యత్తును నిర్మించే బాధ్యతగల పౌరుడిగా ఎదగాలని ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, నాణ్యమైన విద్య, పారదర్శక విద్యా విధానం, అవినీతి నిర్మూలన, క్యాంపస్ అభివృద్ధి వంటి అంశాలపై ఏబీవీపీ అనేక ఉద్యమాలు చేపట్టిందన్నారు. అలాగే సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సైబర్ సెక్యూరిటీ అవగాహన, డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలో విశిష్టమైన సేవలు అందిస్తోందని తెలిపారు.అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వేలాది మంది ఏబీవీపీ కార్యకర్తలు జైలు శిక్షలను సైతం ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. దేశ సమైక్యత, జాతీయ భద్రత, సరిహద్దుల రక్షణ, అక్రమ చొరబాట్ల నియంత్రణ వంటి జాతీయ అంశాలపై కూడా ఏబీవీపీ ఎప్పటికప్పుడు తన గళాన్ని వినిపిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి యలమల హేమ సుందర్, లింగాల రాకేష్, సంతోష్, దమ్ముజు అమితేష్ , చరణ్, నరేష్,శివ, గణేష్, వినయ్, అబ్దుల్, చేపూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## తిరుమల ప్రింటింగ్ ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల కేంద్రంలోని ఇందిరానగర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన తిరుమల డిజిటల్ ఫ్లెక్సీ అండ్ ప్రింటింగ్ వ్యాపార సముదాయాన్ని మాజీ ఎమ్మెల్యే శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమల డిజిటల్ యాజమాన్య సభ్యులైన విష్ణువర్ధన్ చారి, వినయ్ గౌడ్ లకు మాజీ ఎమ్మెల్యే శేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మాట్లాడుతూ డిజిటల్ అండ్ ప్రింటింగ్ వ్యాపారం బాగా జరగాలని, అలాగే ప్రింటింగ్ క్వాలిటీ వాటన్నిటిని బాగా చూసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే శేఖర్ ను వ్యాపార సముదాయ యాజమాన్యం సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## డోలారోహణంలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని రైస్ మిల్ అసోసియేషన్ వద్ద ఉన్న విష్ణు కన్వెన్షన్ హాల్లో గురువారం టీజీ కృష్ణ (పండుగ సాయన్న) మనవడి డోలారోహణ కార్యక్రమంలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి సామృత్ సాయి ని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ యువసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య తీర్చాలని ఏఈకి బిజెపి వినతి



**జయభేరి, దేవరకద్ర :**

దేవరకద్ర మున్సిపాలిటీ తో పాటు మండలంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని దేవరకద్ర మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ ఏఈకి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు యజ్ఞభూపాల్ రెడ్డి, దేవన్న సాగర్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు, కౌన్సిలర్ రాజు, నాగిరెడ్డి, రాచాల రాజు, అప్పి అనిల్ కుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## రాక్ బాల్ క్రీడాకారుడు గోపాల్ యాదవ్ ను సన్మానించి ఎమ్మెల్యేలు



**జయభేరి, మేడ్చల్ :**

దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు విజయానికి విశేషంగా కృషి చేసి దేశానికి కీర్తి తీసుకొచ్చిన మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారుడు ఇటబోయిన గోపాల్ యాదవ్‌ను మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయంలో భాగస్వామి కావడం గర్వకారణమని అన్నారు. తెలంగాణ యువత క్రీడల్లో రాణిస్తూ దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. గోపాల్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గోపాల్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించి, ఆయన క్రీడా ప్రస్థానానికి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో కోచ్ లక్ష్మణ్, మాజీ జిల్లా గ్రంథాలయాల చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షులు దయానంద్ యాదవ్,మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు నవీన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ రఘు, మాజీ వార్డు సభ్యులు కొల్ల వెంకటేష్, శేఖర్ రెడ్డి, యువకులు లక్ష్మణ్ యాదవ్,అనిల్ యాదవ్, పరమేశ్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాలకు అడ్డులేదు..!

- ఇష్టానుసారంగా కమర్షియల్ షెటర్ల నిర్మాణాలు..
- టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై విమర్శలు..
- ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నట్లు ఆరోపణలు..

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మేడ్చల్ రైల్వే స్టేషన్ నుంచి గిర్మాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండానే కమర్షియల్ షెటర్ల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట లేకుండా పోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇటీవల మేడ్చల్ జిల్లా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని పాత జిల్లా పరిషత్ కార్యాలయ భవనానికి మార్చడంతో ఆ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ అవకాశాన్ని కొందరు ఆసరాగా చేసుకుని వాణిజ్య సముదాయాలు, కమర్షియల్ షెటర్ల నిర్మాణాలను వేగవంతం ల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. భవన నిర్మాణాలకు అవసరమైన అనుమతులు, లేఅవుట్ ఆమోదాలు, ఇతర నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు సాగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు, రియల్ ఎస్టేట్ కార్యాలయాలు, న్యాయ సేవలకు సంబంధించిన కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు అధిక డిమాండ్ ఏర్పడింది. దీంతో కొందరు వ్యాపారులు రాత్రికి రాత్రే కమర్షియల్ షెటర్ల నిర్మాణాలు చేపడుతూ భారీ మొత్తాలకు అడ్వాన్స్‌లు తీసుకుంటున్నారని సమాచారం. ఒక్కో షెటర్ కోసం లక్షల రూపాయల అడ్వాన్స్‌లు చెల్లించి దక్కించుకునేందుకు పోటీ నెలకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మొన్నటి వరకు నిర్మానుష్యంగా కనిపించిన ఈ రహదారి ప్రస్తుతం పూర్తిగా వాణిజ్య కేంద్రంగా మారుతోంది. అయితే ఈ నిర్మాణాలన్నీ నిబంధనల మేరకే జరుగుతున్నాయా, లేక అక్రమంగా కొనసాగుతున్నాయా అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణాలు పెరిగితే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు, ప్రజలకు అసౌకర్యాలు తలెత్తే అవకాశముందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, అనుమతి రుసుములు, అభివృద్ధి ఛార్జీలు వసూలు కాక ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి, అనుమతులు లేకుండా కొనసాగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అరికడితేనే భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలకు చెక్ పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.





## యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్‌గా చీర శ్రీశైలం

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 09 :**

యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్‌గా మాజీ ఎంపీపీ చీర శ్రీశైలంను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం విడుదల చేసిన ప్రకటనలో యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేట గ్రామానికి చెందిన చీర శ్రీశైలంను యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు సభ్యుల పేర్లను వెల్లడించింది. చైర్మన్‌గా చీర శ్రీశైలంతో పాటు సభ్యులుగా శారాజీ వెంకటేష్, గజం లక్ష్మీనర్సయ్య,సుడుగు బాల్‌రెడ్డి,ఎడ్ల రాంరెడ్డి, తిరుమాని అయిలయ్య, ధీరావత్ నర్సింహ్మా,ఇండ్ల వెంకటేష్,గుజ్జుల రుక్కమ్మ, నువ్వుల రమేష్,బొజ్జ శ్రీను, జాలిగం అండమ్మ,నమిలె లింగంను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

## బాకీ నరసింహకు చిరు సత్కారం



**జయభేరి, దేవరకొండ :**

భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా నల్గొండ జిల్లా అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన బాకీ నరసింహ దేవరకొండ పట్టణానికి విచ్చేసిన సందర్భంగా, భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు జల్దా భాస్కర్ వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాకీ నరసింహకి నూతన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతం కోసం ఎస్సీ మోర్చా మరింత సమర్థవంతంగా పనిచేసి, ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సంఘం జన జాగరణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

- జిల్లా బాధ్యులు ఎనగాండ్ల నాగిరెడ్డి
- ప్రధానోపాధ్యాయులు పి వేణు మాధవరెడ్డి

**జయభేరి, దంతాలపల్లి, జులై 09 :**




ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపల్ల వేణుమాధవ రెడ్డి అధ్యక్షతన ఈరోజు సిపిఎస్ రద్దు ఓపిఎస్ పునరుద్ధరణ కోసం తలపెట్టిన టీఎస్ సిపిఎస్ఈయు జన జాగరణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణను పల్ల వేణు మాధవ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా బాధ్యులు ఎనగాండ్ల నాగిరెడ్డి, చింతల సురేష్ టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బలాస్టి రమేష్, పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం దంతాలపల్లి మండల శాఖ అధ్యక్షులు బండా శ్రీనివాస రెడ్డి జిల్లా బాధ్యులు ఈదురు రమేష్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా బాధ్యులు నాగిరెడ్డి మాట్లాడుతూ.. సిపిఎస్ రద్దు కోసం జరిగే జన జాగరణ యాత్రలో ఉద్యోగ ఉపాధ్యాయ మిత్రులందరు పాల్గొని యాత్రను విజయవంతం చేయగలరని సిపిఎస్ రద్దు కోసం జరిగే పోరాటంలో తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరు పోరాటంలో భాగస్వామ్యం కావాలి అని కోరారు. జూన్ 11న భద్రాచలంలో ప్రారంభమయ్యే యాత్రకు ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలు పాల్గొని కార్యక్రమం ను విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి మంజుల పరాంకుషాచారి, రవి చందర్, వేణుగోపాల్, శ్రావణ్ కుమార్ సురేష్ మధుకర్, ధనలక్ష్మి, కళ్యాణి, సంతోష్, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

## హామీ లేకుండానే పరవాడ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌లో ఎడ్యుకేషన్ లోన్స్

- బాలికలకు ప్రత్యేక వడ్డీ రాయితీ
- తక్కువ వడ్డీకే విద్యా రుణాలను అందిస్తున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

**జయభేరి, పరవాడ:**

ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను దూరం చేస్తూ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పరవాడ శాఖ ప్రత్యేకంగా మహా బ్యాంక్ ఎడ్యుకేషన్ లోన్ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దేశీయంగా, విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ సులభతర విద్యా రుణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పరవాడ బ్రాంచ్ మేనేజర్ పి. వి. కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యపై చేసే పెట్టుబడి జీవితానికి శాశ్వత సంపద. డబ్బు కొరత కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు ఆగకూడదనేదే మా లక్ష్యం. విద్యార్థుల కలలను నిజం చేసేందుకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పరవాడ బ్రాంచ్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది అని ఈ సందర్భంగా పరవాడ బ్రాంచ్ మేనేజర్ పి. వి. కమలాకర్ తెలియజేసారు. మరిన్ని వివరాల కోసం మహా బ్యాంక్ ఎడ్యుకేషన్ లోన్ గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి, దరఖాస్తు చేసుకోవడానికి పరవాడ బ్రాంచ్ మేనేజర్ పి.వి.కమలాకర్ ని 8332996632 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

# ప్రోటోకాల్ విషయంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- స్థానిక ప్రజాప్రతినిధికే సమాచారం కరువయే...!
- రూ.కోటి కళ్యాణ మండపం శంకుస్థాపనకు వైస్ ఎంపీపీకి కనీస సమాచారం కరువు
- అధికారుల తీరుపై వైస్ ఎంపీపీ తీవ్ర ఆగ్రహం

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి అయితే ప్రోటోకాల్ పాటించాల్సిన అవసరం లేదా ప్రజల చేత ఎన్నుకోబడిన వైస్ ఎంపీపీకి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం అధికారుల నిష్పక్షపాత వైఖరికి నిదర్శనమా అంటూ అధికారుల తీరుపై వైసీపీ వైస్ [illegible] తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరవాడ మండలం రావాడ పంచాయతీ పరిధిలోని ధర్మారాయుడుపేట గ్రామంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న కళ్యాణ మండపానికి గురువారం శంకుస్థాపన నిర్వహించారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధిగా ఉన్న వైసీపీ వైస్ ఎంపీపీకి కనీస సమాచారం ఇవ్వకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి, ప్రోటోకాల్ ప్రకారం తనను ఆహ్వానించాల్సిన బాధ్యత ఉందా లేదా అని ప్రశ్నించగా, తనకు ఏమీ తెలియదంటూ సమాధానం ఇచ్చారని వైస్ ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోకు ఫోన్ చేసినప్పటికీ కనీసం ఫోన్ ఎత్తి స్పందించే పరిస్థితి కూడా లేకపోవడం ప్రజాప్రతినిధులకు అధికారులు ఇస్తున్న గౌరవానికి నిదర్శనమా అని నిలదీశారు. అధికారులు కూటమి ప్రభుత్వానికి మాత్రమే పనిచేస్తున్నారా లేక ప్రజలందరికీ, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు జవాబుదారీగా పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు. వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి కావడమే తనను విస్మరించడానికి కారణమా రాజకీయ పార్టీని బట్టి ప్రోటోకాల్ నిబంధనలు మారిపోతాయా అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ సంస్థకు చెందిన సీఎస్ఆర్ నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధిని విస్మరించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో కొందరు అధికారులు రాజకీయ పెద్దల మెప్పు కోసం ప్రజాస్వామ్య విలువలను, ప్రోటోకాల్ నిబంధనలను పక్కన పెడుతున్నారని ఆరోపించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను అవమానించేలా వ్యవహరించడం మానుకోవాలని, అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.



## రేవంత్ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ ఆగమాగం

- బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ విమర్శించారు.గురువారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.....ఈ విద్యా సంవత్సరంలో కూడా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అడ్మిషన్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన 21.39 లక్షల అడ్మిషన్ల లక్ష్యానికి బదులుగా కేవలం 17.73 లక్షల మంది విద్యార్థులు మాత్రమే నమోదు కావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.గత సంవత్సరంతో పోలిస్తే లక్షన్నర మందికిపైగా అడ్మిషన్లు తగ్గడం ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసం తగ్గిందనే విషయాన్ని స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు, నాణ్యత క్షీణించాయని ఆరోపించారు. గత 31 నెలల్లో ఫుడ్ పాయిజన్‌తో పాటు ఇతర ఘటనల్లో 133 మంది గురుకుల విద్యార్థులు మరణించడం అత్యంత విషాదకరమని, ఈ ఘటనలతో తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారని అన్నారు.ప్రభుత్వం బూట్లు, బెల్టులు, యూనిఫారాలు, ఎడ్యుకేషన్ కిట్లు అంటూ ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటికీ అనేక మంది విద్యార్థులకు అవి పూర్తి స్థాయిలో అందలేదని విమర్శించారు. ప్రచార ఆర్భాటం కంటే విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు సకాలంలో అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేసినప్పటికీ అడ్మిషన్లు పెరగకపోవడం ఆందోళనకరమని, ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో విశ్వాసం తగ్గి, ప్రైవేట్ పాఠశాలల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, విద్యార్థుల భద్రత, మౌలిక వసతులు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు.

## మాజీ మంత్రి బొత్స జన్మదిన శుభాకాంక్షలు

- మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి



**జయభేరి, పరవాడ:**

విజయనగరం నివాసం లో మాజీ మంత్రివర్యులు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ కలిసి పెందుర్తి మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నం రెడ్డి అదీప్ రాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.వారితో పాటు రాష్ట్ర ఎస్ఈసి సభ్యులు కోడిగుడ్ల దేవి సాంబ, సీనియర్ నాయకులు బొకం రాము నాయుడు, ఉప్పిలి కనకరాజు, సబ్బవరపు నారాయణ మూర్తి, 95వవార్డు అధ్యక్షులు రాపర్తి మాధవ రావు,విజయనగరం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్,జతిన్ యాదవ్,పీతల ఆకాష్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల కోసం కళాశాల సమయాలకు అనుగుణంగా బస్సులు నడపాలి: ఎస్ఎఫ్ఐ

**జయభేరి, మేడ్చల్ :**




జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నప్పటికీ, కళాశాలల సమయాలకు అనుగుణంగా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కమిటీ పేర్కొంది. ఈ మేరకు గురువారం సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ కళాశాలలు సాయంత్రం 4:30 గంటలకు ముగుస్తుండగా, సంబంధిత గ్రామాలకు వెళ్లే బస్సు 4:10 గంటలకే బయలుదేరుతోందని, దీంతో విద్యార్థులు ఆ బస్సును అందుకోలేకపోతున్నారని తెలిపారు. అనంతరం వచ్చే బస్సు సాయంత్రం 5:30 గంటలకు మాత్రమే ఉండటంతో విద్యార్థులు గంటకుపైగా బస్టాండ్‌లో వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ఆ బస్సు కూడా సాయంత్రం 6 గంటలకు ప్రధాన బస్ స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడి నుంచి మరో బస్సు లేదా ఇతర వాహనాల్లో ప్రయాణించి రాత్రి వేళల్లోనే గ్రామాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థినులు చీకటి పడిన తర్వాత దూర గ్రామాలకు వెళ్లాల్సి రావడం భద్రతాపరంగా ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇంటికి ఆలస్యంగా చేరుకోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, చదువుకు కేటాయించాల్సిన సమయం ప్రయాణంలోనే వృథా అవుతోందని పేర్కొన్నారు.కనుకుంట, వీరారెడ్డిపల్లి, మైసిరెడ్డిపల్లి, కొనాయిపల్లి, దబిల్‌పూర్, నూతన్‌కల్, కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల విద్యార్థులు ఈ సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం, ఆర్టీసీ విద్యార్థుల నుంచి బస్‌పాస్‌ల రూపంలో రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ, వారి అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కళాశాలలు ముగిసే సమయానికి అనుగుణంగా సాయంత్రం 4:45 లేదా 5 గంటలకు బస్సు ఏర్పాటు చేయాలని, అవసరమైతే విద్యార్థుల కోసం అదనపు ప్రత్యేక బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి ఆర్టీసీ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వినయ్, సాయి, రాజాతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం

- ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవఅధ్యక్షులు గని శెట్టి

**జయభేరి, పరవాడ:**



ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం పౌరులకు తగినంత పౌష్టికాహారాన్ని అందించాలని కోరుతుంటే కేంద్ర ప్రభుత్వం ఉన్న చట్టాన్ని నీరు గార్చే చర్యలు చేపడుతున్నదని ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షుడు గని శెట్టి సత్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. గురువారం పరవాడ లో జరిగిన సిఐటియు సమావేశంలో గని శెట్టి మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఉద్యమాల్లోకి రావాలని ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు, ప్రజాసంఘాలకు గని శెట్టి పిలుపునిచ్చారు. అన్నార్తులందరికీ ఆకలి తీర్చే విధంగా ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరుతుంటే పేదల నోటి కాడ కూడుతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని గని శెట్టి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ అన్న యోజన కార్డులకు ఇప్పటి వరకు ఇస్తున్న 35 కేజీలను కుదించడాన్నీ ఖండించారు. ఏ ఏ వై కార్డులకు ఇప్పటివరకు కుటుంబానికి ఒకరు ఉన్నా,ఇద్దరు ఉన్న 35 కేజీలు చొప్పున ఆహార ధాన్యాలు ఇచ్చే వారిని తెలిపారు. మూడు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టానికి సవరణలు చేస్తూ, కుటుంబంలో ఒకరుంటే ఏడు కేజీలు మాత్రమే ఇవ్వాలని చేసిన నిర్ణయం పేదల ఆకలిని పెంచే విధంగా ఉందని గని శెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో 35 శాతం మంది పిల్లలు ఎదుగుదల లోపంతోనూ, 32 శాతం మంది బరువు తక్కువతోను, బాలింతలు, పసిబిడ్డల్లో 67% రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. వీరికి పౌష్టికాహారాన్ని అందించాలని ఆరోగ్య వేత్తలు, మేధావులు కోరుతుంటే ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నదని గని శెట్టి అన్నారు.పేదల ఆకలిపై దెబ్బ కొడుతున్న పాలకుల చర్యలను ప్రజలంతా ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో లక్ష్మణరావు, దేవా కిషోర్, ఈశ్వరరావు, రాము, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

- అమరవీరుల త్యాగ స్మరణతో మార్మోగిన శక్తి స్థల్

**జయభేరి, పరకాల, జూలై 9:**



ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి ఉద్యమమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబివిపి) 78వ ఆవిర్భావ దినోత్సవం పరకాలలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పరకాల శక్తిస్థల్ వద్ద జరిగిన కార్యక్రమాలు విద్యార్థి లోకంలో నూతన ఉత్తేజాన్ని నింపాయి. ఈ కార్యక్రమ ప్రారంభంలో ఏబీవీపీ పూర్వ నాయకులు గండ్ర శ్రీనివాస్ రెడ్డి భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏబీవీపీ నగర కార్యదర్శి కార్తీక్ ఇతర నాయకుల సమక్షంలో ఏబీవీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కాషాయ జెండా రెపరెపలతో శక్తి స్థల్ ప్రాంగణం విద్యార్థి నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా వేదికపై ఏబీవీపీ టైగర్, భారతమాత ముద్దుబిడ్డ దివంగత 'దగ్గు వెంకన్న'ని స్మరించుకుంటూ నివాళులర్పించారు. నరహంతక నక్సలైట్ల చేతిలో బలిదానమైన వెంకన్న త్యాగం వృథా పోదని, ఆయన చూపిన బాటలోనే నేటి కార్యకర్తలు నడుస్తున్నారని నాయకులు కొనియాడారు. విద్యార్థుల కోసం ప్రాణాలర్పించిన ఆయన స్ఫూర్తి ఏబీవీపీ ప్రతి కార్యకర్తకు ధైర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థి గండ్ర శశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 1949 నుంచి ఏబీవీపీ కొనసాగిస్తున్న ప్రస్థానం అభినందనీయం. చదువుతో పాటు సమాజ బాధ్యత కలిగిన విద్యార్థిని తీర్చిదిద్దడమే మన లక్ష్యం. పరకాల వంటి ప్రాంతాల్లో ఏబీవీపీ చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయి అని ఆయన అన్నారు. నగర కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ.. ఏబీవీపీ అంటే కేవలం ఒక సంఘం కాదు, అదొక శక్తి. క్యాంపస్‌లలో జరిగే అక్రమాలను, దేశ వ్యతిరేక కుట్రలను ఎదుర్కోవడంలో ఏబీవీపీ ఎప్పుడూ ముందుంటుంది. 'జ్ఞానం శీలంఏకత' అనే సూత్రాలే మన ఆయుధాలు. దగ్గు వెంకన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, పరకాలలో సంస్థను మరింత పటిష్టం చేస్తాం," అని స్పష్టం చేశారు. రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించామని కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ముఖ్య పరకాల నాయకులు సాయి,మనోజ్, రాకేష్, నాయకులు గాజుల నిరంజన్, ఎర్రం రామన్న, మారేడుగొండ భాస్కరాచారి, మిడిదొడ్డి నరేష్, పాలకుర్తి ప్రతాప్, వెంకన్న, పాపుశెట్టి శ్రీనివాస్, సంగా పురుషోత్తం, కానుగుల గోపీనాథ్, నగేష్, మార్త రాజభద్రయ్య, కుంట మల్ల గణేష్, కాగితపు చంద్రమోహన్, తాడిశెట్టి రజినీకాంత్, గుండు శివ భరత్, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో విద్యార్థి మిత్రులు పాల్గొన్నారు.




## ఉదారతతో మానవత్వాన్ని చాటుకున్నా జనసేన నేత హరిబాబు

- తాతగారి జ్ఞాపకార్థం అనాథ పిల్లలకు అన్నదానం

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం,రావాడ పంచాయతీ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు మోటూరు హరిబాబు తన ఉదారతతో మానవత్వాన్ని చాటుకున్నారు.ఆయన తాతగారైన స్వర్గీయ ఊడి నరసింహులు వర్ధంతిని పురస్కరించుకుని గురువారం అచ్యుతాపురం మండలం, కొండకర్ల గ్రామంలోని ఇచా ఫౌండేషన్ లోని వికలాంగులైన అనాథ పిల్లలకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా హరిబాబు ఫౌండేషన్‌ను సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న పిల్లలకు బిస్కెట్లు,బ్రెడ్లను పంపిణీ చేశారు.అలాగే వారి ఒక రోజు మధ్యాహ్న భోజన వసతి ఖర్చుల నిమిత్తం ఫౌండేషన్ నిర్వాహకులకు నగదు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు.కుటుంబంలోని పెద్దల జ్ఞాపకార్థం ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని స్థానికులు కొనియాడారు. దిక్కులేని పిల్లలకు అండగా నిలిచి,వారి ఆకలి తీర్చిన మోటూరు హరిబాబు ఉదార స్వభావంపై ఇచా ఫౌండేషన్ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తూ,ఆయనకు ప్రత్యేక అభినందనలు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హరిబాబు తో పాటు జనసేన నాయకుడు మోటూరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షునిగా కోట సురేష్



**జయభేరి, తుర్కపల్లి, జూలై 09 :**

తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం తుర్కపల్లి మండల అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన కోట సురేష్‌ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మాజీ జేఏసీ చైర్మన్ ఎరుకల వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కోట సురేష్‌కు నియామక పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారునికి 250 ఇంటి స్థలంతో పాటు, 30 వేల రూపాయల పెన్షన్ సౌకర్యంతో, పాటు ప్రతి ఉద్యమకారునికి గుర్తింపు కార్డులను ఇచ్చి గౌరవించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క ఉద్యమకారునికి న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు సీస మహేశ్వరి ,బండారి శ్రీను, దేవరుప్పల మల్లేష్, ధ్యానబోయిన బొందయ్య, కరుణాకర్, నవీన్, కొడాలి పరమేష్, రాజు పాల్గొన్నారు.

## శతకోటి హరే రామ నామ జపయజ్ఞం




**జయభేరి, తుర్కపల్లి, జూలై 09 :**

తుర్కపల్లి మండలం కొండాపురం గ్రామంలో శ్రీ పాండురంగ ఆశ్రమం భగవతేత్సవ సమాజం ఆధ్వర్యంలో శతకోటి హరే రామ నామ జప యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త బృందం గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నుండి గ్రామంలోని అన్ని పురవీధుల్లో హరే రామ నామ సంకీర్తనతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోధుమ కుంట పోచయ్య, మద్దూరి స్వామి, కొన్నె పుష్పమ్మ, గోనె కావ్య, సుంకరి రామలీల, గోధుమ కుంట లహరి, గోనె సునంద, దాసరి రామమ్మ పాల్గొన్నారు.

## పిఎసిఎస్ చైర్మన్ గా ధనావత్ శంకర్ నాయక్ నియామకం



**జయభేరి, తుర్కపల్లి, జూలై 09 :**

తుర్కపల్లి మండల పిఎసిఎస్ చైర్మన్గా ధనావత్ శంకర్ నాయక్ను నియమించారు. సభ్యులుగా మోత్కుపల్లి రవి, బానోతు వినోద్, జాగిల్లపురం సతీష్ ,గుగులోతు హనుమంతు నాయక్ ,పని గట్ల సుదర్శన్ గౌడ్, ఒగ్గు బిక్షపతి, వంగ నారాయణరెడ్డి, సడల లత, సింగం శ్రీనివాస్, రామగిరి మహేష్‌కుమార్, సిద్ధంకి లక్ష్మి, పాముల రాజు లను నియమించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. సహకార సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి కృషి చేస్తానని అన్నారు.

# కాక రేపుతున్న కడియం, కొండా వివాదం

✍ జయభేరి, వరంగల్, జూలై 9 :




తెలంగాణలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లా స్థాయి నాయకుల మధ్య సమన్వయం లోపం పెను దుమారం రేపుతూనే ఉంది. ఇప్పటికే ఇలాంటి పంచాయితీలు భరించలేని నాయకులు తమ దారి తాము చూసుకున్నారు. మరికొందరు సైలెంట్ అయిపోయారు. ఇప్పుడు తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కడియం శ్రీహరి, మంత్రి కొండ సురేఖ మధ్య వివాదం తలెత్తింది. తన శాఖలో విషయాలపై తన శాఖ కమిషనర్‌తో కడియం శ్రీహరి ఎలా సమీక్ష జరుపుతారని కొండా సురేఖ నిలదీస్తున్నారు. కచ్చితంగా ఇది ఆయన అహంకారానికి నిదర్శనమని అంటున్నారు. అయితే ఇది అవగాహన లోపం కారణంగానే జరిగిందని కడియం శ్రీహరి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఈ వివాదాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సురేఖ, తాజాగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.

**మహేష్ గౌడ్‌ను కలిసి మంత్రి సురేఖ**

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై ఆగ్రహంతో ఉన్న మంత్రి కొండా సురేఖ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరితో సమస్యగా ఉందని, తనకు ఇబ్బంది పెట్టేలా రాజకీయం చేస్తున్నాని మండిపడ్డారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన శాఖలో జోక్యం చేసుకొని అధికారులతో ఎలా సమీక్ష నిర్వహిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వ్యక్తి ప్రోటోకాల్ పాటించకుండా వ్యవహరించడం ఏంటని నిలదీశారు. క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రికి,, రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌కు లేఖ రాసినట్టు పేర్కొన్నారు.ఫిర్యాదు చేసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి కొండా సురేఖ... కడియం శ్రీహరిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన వ్యక్తి వారిని మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. మొదటి నుంచి కూడా కడియం రాజకీయం ఇలానే ఉంటుందని ఆరోపించారు. తెలుగుదేశంలో ఆయనకు మిత్రులుగా ఉన్న వారి సహకారం కూడా ఉందని అందుకే ఇష్టం వచ్చినట్టు రెచ్చిపోతున్నారని తీవ్రమైన విమర్శలు చేశారు. గతంలో కీలక పదవుల్లో అధికార దర్పం వెలగబెట్టిన శ్రీహరి ఇప్పుడు సాధారణమైన ఎమ్మెల్యేగా ఉండలేకపోతున్నారని ఆరోపించారు.

**త్వరలోనే అన్నీ సర్దుకుంటాయి: మహేష్**

రగులుతున్న రాజకీయం త్వరలోనే సమసిపోతుందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జరుగుతున్న పరిణామాలపై నేతలతో మాట్లాడుతున్నట్టు వెల్లడించారు. త్వరలోనే అన్ని పరిష్కారం అవుతాయని అన్నారు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఇలాంటివి సర్వసాధారణంగా జరుగుతుంటాయని, అందర్ని పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగేలా ఎవరు వ్యవహరించినా సహించేది లేదన్నారు.



## ఎల్లంపేట్ మున్సిపల్ కౌన్సిలర్ ముత్యాలు గౌడ్ నూతన గృహ ప్రవేశానికి కాంగ్రెస్ నేతల హాజరు

✍ జయభేరి, మేడ్చల్:

ఎల్లంపేట్ మున్సిపల్ కౌన్సిలర్ ముత్యాలు గౌడ్ నూతన గృహ ప్రవేశ మహోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్యాలు గౌడ్ దంపతులకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, నూతన గృహంలో ఆనందమయమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ 297 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, 298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు జాకట దేవరాజ్, కౌడె మహేష్ కురుమ, వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా, బత్తుల మధుకర్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఉదండపురం సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నడికొప్పు రంజిత్ ముదిరాజ్, గోమారం బాల్ రెడ్డి, రామన్నగారి రాఘవేందర్ గౌడ్, దుబ్బ రామస్వామి ముదిరాజ్, రామన్నగారి సంతోష్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కును కాపాడుకోవాలి



✍ జయభేరి, సైదాపూర్ :

జాగిరిపల్లి గ్రామంలో జరిగే SIR ఓటర్ సవరణ ప్రక్రియను సైదాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, బిఎల్ ఓ, బిఎల్ ఎలు అందరు కలిసి ఈ ప్రక్రియ పర్యవేక్షించడం జరిగినది. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును పోకుండా కాపాడే బాధ్యత బిఎల్ఎ, బిఎల్ఓ లదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో జాగిరిపల్లి కాంగ్రెస్ ముఖ్య నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మనకు ఓటు హక్కు చాలా ముఖ్యం



✍ జయభేరి, సైదాపూర్ :

బొమ్మకల్ గ్రామంలో జరుగుతున్న SIR కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. మనకి ఓటు హక్కు చాలా ముఖ్యమని అవకాశాన్ని అందరు ఉపయోగించుకొని మీయొక్క ఓటును కాపాడుకోవడంతో పాటు ఏవైనా తప్పులు ఉంటే సరి చూసుకోవాలని BLO లతో పాటు పార్టీ BLA లు కూడ పాల్గొని ఎలాంటి సమస్యలు తలేత్తకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, AMC వైస్ చేర్మెన్ న్యాదండ్ల రాజ్ కుమార్, సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, సర్పంచ్ శ్రీకాంత్, Ex MPTC మల్లయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు పద్మనాభం, నాయకులు కుమార్, శ్రీనివాస్, రవీందర్, కొమురయ్య, రఘుపతి, కనుకయ్య, సత్తయ్య, మాజీ సర్పంచ్ ప్రకాష్ రెడ్డి, BLO శ్రీనివాస్ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మతం మారడంఇష్టం లేక ఆత్మహత్య

✍ జయభేరి, హైదరాబాద్, జూలై 9 :

ఆర్థిక వివాదాలు, మతం మారాలంటూ పొరుగువారి నుంచి ఎదురైన తీవ్ర ఒత్తిడి కారణంగా ఓ దంపతులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన ఈ జంట, తమ ఇద్దరు చిన్నారులను అనాథలను చేస్తూ జూలై 2న ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు వదిలారు. క్రైస్తవ మతంలోకి మారాలని పొరుగువారు తమ తల్లిదండ్రులను బలవంతం చేశారని, ఆ వేధింపులే వారి ఆత్మహత్యకు దారితీశాయని వారి 14 ఏళ్ల కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టిస్తోంది.వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేటకు చెందిన రవికుమార్, శిరీష దంపతులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలసు వచ్చి, హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరులో నివాసం ఉంటున్నారు. బియ్యం వ్యాపారం చేసే రవికుమార్‌కు పొరుగున ఉండే వెంకట్, ప్రమీలతో పరిచయం ఏర్పడింది. రెడీమిక్స్ కాంక్రీట్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే నెలకు రూ.20,000 ఆదాయం వస్తుందని వారు నమ్మించారు. వారి మాటలు నమ్మిన రవికుమార్, తన భార్య బంగారు నగలను తాకట్టు పెట్టి సుమారు రూ.20 లక్షల వరకు వారికి అందజేశారు.అయితే, నిందితులు కేవలం రెండు మూడు నెలలు మాత్రమే నగదు చెల్లించి, ఆ తర్వాత నిలిపివేశారు. దీంతో అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడంతో రవికుమార్ దంపతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఇదే సమయంలో మతం మార్చుకోవాలంటూ వెంకట్, ప్రమీల తమపై ఒత్తిడి తెచ్చారని, చర్చికి రావాలని నిరంతరం వేధించేవారని వారి కుమారుడు సుశాంత్ పోలీసులకు తెలిపాడు. ఈ వేధింపులు భరించలేక వారు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవడానికి కూడా సిద్ధపడ్డారు.జూలై 2న ఆత్మహత్యకు పాల్పడకముందు రవికుమార్ దంపతులు వెంకట్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు కాల్ డేటా రికార్డులు ద్వారా స్పష్టమవుతోంది.

# విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ

- కమలానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సేవా కార్యక్రమం

✍ జయభేరి, మేడిపల్లి, జూలై 9:




మేడిపల్లిలోని కమలానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడిపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రాజోజు నరసింహాచారి అధ్యక్షత వహించారు. డిస్ట్రిక్ట్ 320F, రీజియన్-6, జోనల్ చైర్‌పర్సన్ లయన్ వేముల నాదం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి ఆదర్శప్రాయులుగా ఎదగాలని" ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ సమాజ సేవకు ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ లయన్ మేకల మల్లేశం,లయన్ లావణ్య,లయన్ సోమేశ్వర్,లయన్ సావిత్రి,లయన్ దుర్గ,లయన్ పల్లె బాలరాజు,కోశాధికారి లయన్ మహేందర్ రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాలనీవాసులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రధాన కార్యదర్శి లయన్ మేకల మల్లేశం ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.భవిష్యత్తులో కూడా మేడిపల్లి లయన్స్ క్లబ్ తరఫున విద్య, వైద్యం, సేవా రంగాల్లో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# మహిళా న్యాయవాదిపై దాడి

- నిందితులు ఇంకా బయటే
- న్యాయం కోసం న్యాయవాది పోరాటం

✍ జయభేరి, మేడిపల్లి, జూలై 9 :




మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి నారపల్లి లోని ఓ మహిళా న్యాయవాది కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, న్యాయస్థానాలు జారీ చేసిన ఉత్తర్వులను సైతం అమలు చేయడం లేదని బాధిత న్యాయవాది మల్లుల శిరీష తీవ్ర ఆరోపణలు చేశారు. తనపై దాడి జరిగినప్పటికీ నిందితులపై ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి కథనం ప్రకారం స్థానిక రౌడీలతో పాటు అలేటి మోహన్ రెడ్డి, వెంకటేష్ నారోజీ, ప్రవీణ్ నారోజి, ప్రవీణ్ భార్య, తల్లి, మేఘనాథ్ తదితరులు తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ వ్యక్తులపై సీనియర్ సివిల్ జడ్జి తనకు అనుకూలంగా మధ్యంతర నిషేధాజ్ఞ (ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసినప్పటికీ, దానిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. దాడి సమయంలో తన క్లయింట్లకు సంబంధించిన కీలకమైన కేసు ఫైళ్లు, పత్రాలు ఇతర ముఖ్యమైన మెటీరియల్‌ను నిందితులు బలవంతంగా తీసుకెళ్లారని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం ఆ మెటీరియల్ నిందితుల వద్దే ఉన్నప్పటికీ, వాటిని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఈ వ్యవహారంపై హైకోర్టు కూడా నిందితుల వద్ద ఉన్న మెటీరియల్‌ను తిరిగి స్వాధీనం చేసుకొని బాధితురాలికి రక్షణ కల్పించాలని సూచించినప్పటికీ ఆ ఉత్తర్వులను సమర్థవంతంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ కేసులో దర్యాప్తు పక్షపాతంగా సాగుతోందని ప్రభావశీల వ్యక్తులను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఒక మహిళా న్యాయవాదిపైనే కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ న్యాయం జరగకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని బాధితురాలు ప్రశ్నించారు. న్యాయస్థానాల ఆదేశాలను వెంటనే అమలు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తనకు తన కుటుంబానికి భద్రత కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని ఉన్నతాధికారులను కోరారు. కొందరు సహచర న్యాయవాదులు ఆమెకు మద్దతుగా నిలిచారు.

## భూ వివాదాలు లేకుండా చేస్తాం

✍ జయభేరి, కర్నూలు, జూలై 9 :



భూ వివాద రహిత ఏపీనే లక్ష్యం.. గత పాలకుల పాపాలకు ప్రక్షాళన: సీఎం చంద్రబాబు రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, ఆంధ్రప్రదేశ్‌ను భూవివాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుల అరాచకాలు, పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయని, వారి నల్ల చట్టాలను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని ఆయన అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేసి ప్రజావేదిక సభలో ప్రసంగించారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక నల్ల చట్టమని, ప్రజల ఆస్తులను కాజేసేందుకు, వారిలో భయాందోళనలు సృష్టించేందుకే దానిని తెచ్చారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని గుర్తుచేశారు. "గత పాలకులు తమకు నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూములను 22ఏ జాబితాలో పెట్టేశారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కోవాలని చూశారు. భూమి పత్రాలపై, చివరికి సర్వే రాళ్లపై కూడా వారి ఫోటోలు వేసుకున్నారు. ఆ ఫోటోల పిచ్చిని రద్దు చేసి, ఇప్పుడు రాష్ట్ర రాజముద్రతో, పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ఈ పంపిణీని ఒక పవిత్ర ఉద్యమంగా చేపడుతున్నామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 9,833 గ్రామాల్లో 72,70,605 పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు.భూ సమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. తిరుపతి, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ఏళ్లుగా నలుగుతున్న భూ వివాదాలను పరిష్కరించామని తెలిపారు. డోన్ నియోజకవర్గంలో 2,074 ఎకరాల వక్ఫ్ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేశామని చెప్పారు. ఆటో మ్యూటేషన్ ద్వారా వారసత్వ ఆస్తులను సులభంగా బదిలీ చేసే ప్రక్రియను అమలు చేస్తున్నామన్నారు.రాయలసీమ ముఖచిత్రాన్ని మారుస్తున్నామని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, ఆమ్కా డిఫెన్స్ ఫైటర్ జెట్ ప్లాంట్ (స్టెల్త్ యుద్ధ విమానం) వంటి భారీ పరిశ్రమలు వస్తున్నాయని, ఇక్కడ తయారైన ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌లు దేశమంతా తిరుగుతాయని అన్నారు. రూ.40 వేల కోట్ల ప్రభుత్వ, రూ.60 వేల కోట్ల ప్రైవేట్ పెట్టుబడులతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 22 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని, ఈ నేపథ్యంలో నీటి భద్రత కోసం 'జలధార' కార్యక్రమాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవడం ద్వారానే నీటి భద్రత సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ దిశగా 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్‌డ్యామ్‌లు నిర్మించిన నంద్యాల జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.




## ఆర్టీసీలో 1500 కండక్టర్లు

✍ జయభేరి, హైదరాబాద్, జూలై 9 :

నిరుద్యోగ యువతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా చేపట్టబోతుండగా... చాలా సంవత్సరాల తర్వాత తెలంగాణలో పర్మినెంట్ (శాశ్వత) ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాలను భర్తీ చేస్తుండటం విశేషం.ఈ నోటిఫికేషన్‌లో అభ్యర్థులకు ఊరటనిచ్చే అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ ఉద్యోగాలకు ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించడం లేదు. కేవలం టెన్త్ క్లాస్ లో సాధించిన మార్కుల శాతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ విధానం, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను సిద్ధం చేసి నేరుగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఎలాంటి పోటీ పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగం సాధించే సువర్ణావకాశం కావడంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో పర్మినెంట్ బేసిస్‌పై కండక్టర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే మొదటిసారి. గత కొన్నేళ్లుగా చాలా మంది ఉద్యోగులు రిటైర్ కావడంతో ఖాళీలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ లాంటి మహానగరాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇప్పటివరకు తాత్కాలికంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే బస్సులను నడిపించారు. ఇప్పుడు నేరుగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అనుమతి రావడంతో ఆర్టీసీ రూపురేఖలు మారనున్నాయి.అయితే, అఫీషియల్ నోటిఫికేషన్ విడుదలకు ముందు ఒక చిన్న సాంకేతిక సమస్య ఎదురైంది. గతంలో ఎస్ఎస్‌సీ బోర్డు మార్కుల విధానాన్ని అమలు చేయగా.. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు జీపీఏ (GPA) గ్రేడింగ్ విధానాన్ని తెచ్చింది. మళ్లీ ఇటీవల మార్కుల విధానాన్ని కొనసాగిస్తోంది. దీనివల్ల అప్లై చేసుకునే అభ్యర్థుల్లో కొందరికి మార్కులు, మరికొందరికి కేవలం గ్రేడింగ్ మాత్రమే సర్టిఫికేట్లలో ఉన్నాయి.దీంతో జీపీఏ గ్రేడింగ్‌ను మార్కుల శాతంలోకి ఎలా కన్వర్ట్ చేయాలి? ఇరు విధానాల అభ్యర్థులను సమానంగా ఎలా అంచనా వేయాలనే దానిపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు ఎస్ఎస్‌సీ బోర్డుకు లేఖ రాశారు. బోర్డు నుంచి ఈ మార్గదర్శకాలు అందిన వెంటనే కండక్టర్ ఉద్యోగాల అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది.

## బోనాల ఉత్సవాల కోసం 25 కోట్ల రూపాయల బడ్జెట్

✍ జయభేరి, సికింద్రాబాద్ :

ఆషాఢ బోనాల ఉత్సవాల కోసం 25 కోట్ల రూపాయల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల టిపిసిసి ఉపాధ్యక్షురాలు కోట నీలిమ సంతోషం వ్యక్తం చేశారు.ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల నేపథ్యంలో ప్రభుత్వం నూతనంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోనాల ఉత్సవాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆమె కోరారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అమ్మవారి సేవ చేసుకునేందుకు గొప్ప అవకాశం లభించిందని ఆమె అన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమన్వయం చేసుకొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# మహిళల ఆరోగ్యానికి ఇవి శ్రీరామ రక్ష..

## రోజూ తీసుకుంటే ఊహించని అద్భుతాలు..

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మహిళలు రెట్టింపు బాధ్యతలను మోస్తున్నారు. అటు ఆఫీసు పని, ఇటు ఇంటి బాధ్యతలను చక్కబెట్టే క్రమంలో తమ సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారింది. ఫలితంగా చిన్న వయసులోనే తీవ్రమైన అలసట, హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు చుట్టుముడుతున్నాయి. అయితే వీటన్నింటికీ మన పురాతన ఆయుర్వేదంలో అద్భుతమైన పరిష్కారాలు ఉన్నాయని ప్రముఖ హెల్త్ కోచ్ డింపుల్ జాంగ్డా సూచిస్తున్నారు. ప్రతి మహిళ తన ఆహారంలో భాగం చేసుకోవాల్సిన మూడు ముఖ్యమైన మూలికల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### అశ్వగంధ

అశ్వగంధను కేవలం పురుషులకే పరిమితమైన మూలికగా చాలామంది భావిస్తారు. కానీ ఇది మహిళలకు ఒక సంజీవని లాంటిది. దీనిని అడాప్టోజెన్ అని పిలుస్తారు. ఇది శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను తగ్గించి, నాడీ వ్యవస్థను ప్రశాంతపరుస్తుంది. థైరాయిడ్ గ్రంధి పనితీరును మెరుగుపరచడంలో, శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. మార్కెట్లో లభించే అశ్వగంధ పొడిని గోరువెచ్చని పాలలో కలుపుకుని లేదా హర్బల్ టీ రూపంలో తీసుకోవచ్చు.

### శతావరి (ఆస్పరాగస్): స్త్రీలకు అసలైన నేస్తం

ఆయుర్వేదంలో శతావరికి ఉన్న ప్రత్యేకతే వేరు. వంద రోగాలను నయం చేసే శక్తి దీని సొంతం. పీసీఓఎస్, సంతానలేమి, క్రమరహిత రుతుస్రావం వంటి సమస్యలతో బాధపడే మహిళలకు శతావరి అద్భుతంగా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఈస్ట్రోజెన్ స్థాయిలను క్రమబద్ధీకరిస్తుంది. మీరు గర్భం దాల్చాలని ప్లాన్ చేస్తున్నా లేదా మెనోపాజ్‌లో ఉన్నా, శతావరి హార్మోన్లను అదుపులో ఉంచుతుంది. బాలింతలలో పాల ఉత్పత్తిని పెంచడానికి కూడా ఇది సహాయపడుతుంది. శతావరి పొడిని పాలు లేదా తేనెతో కలిపి రోజుకు ఒకసారి తీసుకోవడం శ్రేయస్కరం.

### తులసి: మానసిక ఉల్లాసానికి మారుపేరు

ప్రతి ఇంట్లో ఉండే తులసి కేవలం పూజకే కాదు, ఔషధ గుణాల గని కూడా. తులసి శరీరంలో సెరోటోనిన్ విడుదలకు దోహదపడుతుంది. ఇది ఆందోళన, నిరాశను దూరం చేసి మనసును ఉల్లాసంగా ఉంచుతుంది.ఇది శరీరంలోని జీర్ణ అగ్నిని ప్రేరేపించి, జీవక్రియను వేగవంతం చేస్తుంది. దీనివల్ల బరువు తగ్గాలనుకునే వారికి, నీరసంగా ఉండేవారికి మంచి ఫలితం ఉంటుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో 34 ఆకులను నమలడం లేదా తులసి టీ తాగడం వల్ల ఊపిరితిత్తులు, జీర్ణాశయం ఆరోగ్యంగా ఉంటాయి.

**ముఖ్య గమనిక: నిపుణుల సూచన**

ఆయుర్వేద మూలికలు సహజమైనవే అయినప్పటికీ, ప్రతి ఒక్కరి శరీర తత్వం వేరుగా ఉంటుంది. కాబట్టి వీటిని మీ దినచర్యలో భాగం చేసుకునే ముందు ఒకసారి ఆయుర్వేద వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. ముఖ్యంగా గర్భిణీలు, ఇతర మందులు వాడుతున్న వారు సరైన మోతాదు కోసం నిపుణుల సలహా తీసుకోవాలి.

ఆరోగ్యం అనేది బాధ్యత మాత్రమే కాదు, అది ఒక పెట్టుబడి. మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టినప్పుడే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మూడు మూలికలను సరైన పద్ధతిలో వాడి సహజసిద్ధమైన ఆరోగ్యాన్ని మీ సొంతం చేసుకోండి.



# మీ పొట్ట కొవ్వు కరగాలంటే ఏది బెస్ట్ ఎక్సర్‌సైజ్?

ఆరోగ్యంగా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం తప్పనిసరి. అందులోనూ వాకింగ్, రన్నింగ్ అత్యంత ప్రజాదరణ పొందిన మార్గాలు. అయితే, వీటిలో ఏది త్వరగా ఫలితాన్ని ఇస్తుంది? ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయిన మొండి కొవ్వును కరిగించడానికి ఏ వ్యాయామం ఎలా సహాయపడుతుంది.? వయస్సు, ఫిట్‌నెస్ స్థాయి, ఆరోగ్య స్థితిని బట్టి ఏది ఎంచుకోవాలో ఈ చిట్కాలు స్పష్టం చేస్తాయి. బరువు తగ్గడానికి సిద్ధమవుతున్న వారికి ఇది ఒక సరైన గైడ్.మీ శరీరానికి ఏది సరిపోతుంది? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

### కేలరీల ఖర్చు:

సాధారణంగా ఒక గంట పాటు వేగంగా నడవడం వల్ల సుమారు 200 నుండి 300 కేలరీలు ఖర్చవుతాయి. అదే ఒక గంట పాటు రన్నింగ్ చేస్తే 500 నుండి 800 కేలరీలు వరకు కరిగించవచ్చు. అంటే, తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు ఖర్చు చేయాలంటే రన్నింగ్ ఉత్తమ ఎంపిక.

### పొట్ట కొవ్వుపై ప్రభావం:

పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించడానికి రన్నింగ్ చాలా వేగంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని మెటబాలిజం రేటును పెంచి, వ్యాయామం ముగిసిన తర్వాత కూడా కేలరీలు ఖర్చయ్యేలా చేస్తుంది. అయితే, నడక వల్ల కూడా క్రమంగా కొవ్వు తగ్గుతుంది, కానీ దీనికి ఎక్కువ సమయం పడుతుంది.

### నడక:

వయసు పైబడిన వారు, అధిక బరువు (Obesity) ఉన్నవారు, కీళ్ల నొప్పులు లేదా గుండె సమస్యలు ఉన్నవారికి నడక సురక్షితం. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది.

### పరుగు:

వేగంగా బరువు తగ్గాలనుకునే యువకులు, ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేనివారు రన్నింగ్ ఎంచుకోవచ్చు. ఇది ఎముకల బలాన్ని పెంచుతుంది.

### జాగింగ్ vs రన్నింగ్:

రన్నింగ్ కంటే కొంచెం తక్కువ వేగంతో పరిగెత్తడాన్ని జాగింగ్ అంటారు. రన్నింగ్ చేయలేని వారు జాగింగ్‌తో ప్రారంభించి, నెమ్మదిగా వేగాన్ని పెంచవచ్చు.

### ముఖ్యమైన చిట్కాలు:

ఏదో ఒక రోజు చేయడం కంటే, రోజూ కనీసం 3045 నిమిషాల పాటు వ్యాయామం చేయడం ముఖ్యం. కీళ్లపై ఒత్తిడి పడకుండా ఉండటానికి మంచి వాకింగ్ లేదా రన్నింగ్ షూస్ ధరించాలి. వ్యాయామంతో పాటు సరైన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. మీరు ఇప్పుడే ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంటే, నడకతో మొదలుపెట్టి నెమ్మదిగా రన్నింగ్‌కు మారడం మంచిది. మీ లక్ష్యం కేవలం ఫిట్‌నెస్ అయితే నడక సరిపోతుంది. అదే బరువు తగ్గడం అయితే రన్నింగ్ లేదా జాగింగ్ మేలు.



# ఆరోగ్యకరమైన కళ్లను పొందండి!

**స్పష్టమైన కంటిచూపు కోసం 7 సులభమైన టిప్స్..**

ప్రస్తుతం డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర స్క్రీన్‌లు ఉపయోగించడం అనేది కంటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్న విషయం తెలిసిందే. మనం ఎక్కువ సేపు స్క్రీన్‌ను చూసినా, కంటి కండరాలు అలసిపోతాయి, కళ్ళు పొడిబారతాయి. అంతేగాక, చూపు సమస్యలు పెరిగిపోతాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం సరైన జీవనశైలి, పోషకాహారం, కొన్ని చిట్కాలు పాటించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

### 1. 20-20-20 సూత్రం:

అందరికీ తెలిసిన 202020 రూల్‌ని పాటించడం ద్వారా స్క్రీన్ చూడడం వల్ల కంటి కండరాలపై పడ్డ ఒత్తిడిని తగ్గించవచ్చు.

ప్రతి 20 నిమిషాలకు స్క్రీన్ చూడటం ఆపాలి. కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు గమనించాలి. ఈ అలవాటు కంటి కండరాలకు విశ్రాంతి ఇచ్చి, కళ్ళు పొడిబారడం, అలసటను తగ్గిస్తుంది.

### 2. సరైన భంగిమ:

స్క్రీన్ కళ్లకు కనీసం ఒక చేతి దూరంలో ఉండాలి. స్క్రీన్ కంటి స్థాయికి కాస్త దిగువగా ఉండేలా పొజిషన్ చేయాలి. గదిలో తగినంత వెలుతురు ఉండాలి, మరీ చీకటి లేదా మరీ ఎక్కువ కాంతి ఉండకూడదు.

### 3. కనురెప్పలు వాల్చడం:

స్క్రీన్ ఉపయోగిస్తున్నప్పుడు కనురెప్పలు సరిగ్గా వాల్చడం చాలా ముఖ్యం. మీరు కనీసం 60% తక్కువగా కనురెప్పలు వాల్చే అవకాశం ఉంటుంది. కనురెప్పలు వాల్చడం వల్ల కళ్ళు తేమగా ఉంటాయి, కళ్ల పొడిబారడం తగ్గుతుంది.

### 4. నిద్ర, హైడ్రేషన్:

ప్రతిరోజూ 7-9 గంటల పాటు నిద్రపోవాలి. నిద్రలేమి వల్ల కళ్ళలో పొడిబారడం, కనురెప్పలు అవడం, దృష్టి మసకబారడం వంటి సమస్యలు వస్తాయి. ప్రతిరోజూ 8-10 గ్లాసుల నీరు తాగాలి. డీహైడ్రేషన్ వల్ల కూడా కళ్ళు పొడిబారతాయి.

### 5. UV రక్షణ:

బయట ఉన్నప్పుడు UV రక్షణ ఉన్న సన్‌గ్లాసెస్ ధరించండి. ఇది కంటి శుక్లాలు, రెటీనా సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

### 6. పోకాహారం

కంటి ఆరోగ్యం ఆహారంపై ఆధారపడి ఉంటుంది. కంటికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పోషకాలు:

**విటమిన్ A:** క్యారెట్లు, బొప్పాయి

**లూటిన్ & జింక్:** ఆకుకూరలు (పాలకూర), గింజలు

**ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్:** చేపలు, వాల్‌నట్స్, విత్తనాలు

**సిట్రస్ పండ్లు:** నారింజ, నిమ్మ

### 7. కంటి వ్యాయామాలు

**కనురెప్పలు ఆర్పడం:** కళ్ళను 10-15 సార్లు వేగంగా ఆర్పండి. ఆ తర్వాత కళ్ళు మూసి విశ్రాంతి తీసుకోండి.

**కనుబొమ్మలను తిప్పడం:** కళ్ళను నెమ్మదిగా వృత్తాకారంలో తిప్పండి. మొదట క్లాక్ వైజ్, తర్వాత యాంటీ క్లాక్ వైజ్.

**దృష్టిని మార్చడం:** మీ బొటనవేలును ముఖం దగ్గర ఉంచి దానిపై దృష్టి పెట్టండి, తర్వాత దూరంగా ఉన్న వస్తువుపై దృష్టి పెట్టండి.

ఈ చిట్కాలు కంటిపై ఒత్తిడిని తగ్గించి, చూపు దెబ్బతినకుండా కాపాడతాయి. అయితే, కంటి సమస్యలు సీరియస్‌గా మారితే.. వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

